# ముందుమాట

"ధనకాముని కథ'' ఒక సగటు భారతీయుని కథ. సగటు భారతీయునికి ధనము ప్రధాన మనిపించును. ఈషణత్రయము లందు సామాన్యముగ భారతీయుడు ధనమున కెక్కువ లోబడును. *'దారేషణ, పుత్రేషణ, ధనేషణ'* ఈషణ త్రయములు. డబ్బుకు లొంగని జీవి లేడని లోకమున ప్రతీతి. ఏదో ఒక సమయమున మనిషి డబ్బుకు లొంగునని, ప్రతి మనిషికి ఒక ధర వుండునని సాధారణ మానవుని అవగాహన.

భారతీయ సాంప్రదాయమున ధనమున కన్న ధర్మము నకు విలువెక్కువ. ధనమునకు ధర్మము కన్న విలువున్నచోట కలి యుండును. ధర్మమునకు విలువున్న చోట దైవముండును. ధర్మమును నిర్వచించి, అనుసరించి బోధించి ఋషులు చరించిన అత్యంత పుణ్యభూమి భరతభూమి. అట్టి భరత భూమియందు ధనపిపాస కలిగి సగటు భారతీయుడు ధర్మములను విస్మరించి నాడు. ఈ రోజున ధనమునకై చేయని దుష్కృత్యము లేదు. విద్య, వైద్యము, రాజ్యాంగము చివరకు దైవ కార్యక్రమములు కూడ ధనమునకు లొంగిన విచిత్రకాలము నందు మనము జీవించు చున్నాము.

మనకు వేద ఋషులు, అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి, సూర్యుడు, చంద్రుడు మొదలుగాగల దేవతల ఆనుకూల్యమే ధన మని, సంపద యని పేర్కొనినారు. ధన మదాంధులు పూర్వకాలమున ఎట్లు నశించిరో పురాణముల యందు పెక్కు కథలు కలవు.

ధనకాముని కథ మరాఠీ భాగవతమున ప్రసిద్ధి గాంచిన కథ. దాని నాధారముగ గొని ఒక ధర్మము నుపదేశించుటయే ఈ పుస్తకము యొక్క ముఖ్య ఆశయము. ధన పిచ్చి నుండి కడతేరి ధర్మము నందు నిలచి ముక్తుడైన ఒక జీవుని కథయే ధనకాముని కథ. చిన్నతనముననే పిల్లలకు బోధించినచో ధనము కొరకు జీవించు దుర్గతి వారికి పట్టదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తాము చదువుకొని పిల్లలకు బోధింతురను సద్భావముతో ఈ ప్రయత్నము చేయబడినది.

ఇట్లు

- కంభంపాటి పార్వతీకుమార్

# ధనకాముని సూక్తులు

* తనను ప్రేమించని వారిని కూడ ప్రేమించువాడు శ్రీహరియే!
* ధనమును ప్రేమించు మోహమున నన్ను కూడ ప్రేమించుట మరచును.
* కాలము నుండి కర్మము నుండి, ఎవ్వడును దేనిని కాపాడుకొనలేడు.
* మానవ జీవిత మంతయు ఒకరి నొకరు దోచుకొనుచు బ్రతుకుటగ కనిపించు చుండును.
* ఎక్కడ ధనమున్నదో అక్కడ అసత్య ముండును.
* సంస్కారపరముగ పతనము చెంది, లోకపరముగ పెరిగిన ఏమి లాభము?
* మానవజాతిని అసత్యమున కూలద్రోసిన ఘనత ఎక్కువగ ధనమునకే దక్కును.
* సత్పురుషునకు ధనార్జనము ధ్యేయము కాకూడదు.
* మోక్షము కోరువారికి ధనాశ విషము వంటిది.
* అన్నదానము, వస్త్రదానము, విద్యాదానము, వైద్యదానము చేయుట సంపన్నుని కర్తవ్యము.
* నిజమునకు ధనము ఏ సుఖమును ఈయలేదు.
* భోగ జీవన మంతయు స్వప్నమే.

* ఈ జగత్తునందు నీతి నియమములతో ప్రవర్తించుటయే కర్తవ్యము.
* జీవుల అజ్ఞానమును హరించి, వివేకము నుదయింప చేయుట హరి సంకల్పము.
* ధార్మిక జీవనము, ప్రాపంచిక విషయానురక్తి పొసగని విషయములు.
* ఇచ్చుట యందు, మరల తీసుకొనుట యందు శ్రీహరి నేర్పు ఊహాతీతము.
* హరి కృపను తెలియగలము గాని, హరిని తెలియలేము.
* మనసున స్ఫూర్తి గలవానికి వార్ధక్యము లేదు.
* ప్రారబ్ధము అనుభవించవలెను కదా ! రాజుకైనను, పేదకైనను ధర్మము అదియే !
* ఆత్మనియతితోనే మనసునందలి సుఖదుఃఖములను జయించ వచ్చును. మనసుతో సుఖదుఃఖములను జయించలేరు.
* తమను గూర్చి భావించుకొను వారందరూ మనసుకు బానిసలే.
* మనో పరిశీలనమును అనునిత్యము చేయుడు.
* తమను తాము మరచినవారిని, మనసేమియు చేయదు.
* పారదర్శకముగ వుండవలెనన్నచో ధర్మాచరణము ఏకైక సూత్రము.

# ధనకాముని కథ

# 1

# ధనకామము

అవంతి నగరములో వ్యవసాయము, వ్యాపారము జీవనమునకై ఏర్పరచుకొని బ్రాహ్మణుడొకడు జీవిస్తూ వుండేవాడు. సమాజములో ధనికుడిగా పేరెన్నిక గన్నాడు. కాని అతడు పరమ పిసినారి అనికూడ పేరుపడ్డాడు. సంతృప్తికరముగ భోజనము కూడ చేయని పిసినారి. ఆలుబిడ్డలను అదుపాజ్ఞలలో పెడుతూ ధన ముండియు కూడ పేదరికము అనుభవిస్తూ వుండేవాడు. ధనమే ప్రధానముగ జీవనము సాగెడిది. బ్రాహ్మణ ధర్మమును విసర్జించి, వైశ్యవృత్తిని ఆలింగనము చేసుకొని, వైదిక కర్మలను, దాన ధర్మము లను మరచినాడు. అతిథులకు కాని, ఆకలి గొన్నవారికి కాని అత డెన్నడును గృహమున విస్తరి వేసి భోజనము పెట్టలేదు. శ్రాద్ధ కర్మములు కూడా అంతంత మాత్రముగనే నిర్వర్తిస్తూ వుండేవాడు, సంఘము "ఛీ" యని చీదరించుకొనినను పిసినారితనమును వదలలేదు. అతడు దాదాపుగా సంఘముచే వెలివేయబడినను ధనమును ఆలంబనము చేసుకొని జీవించేవాడు. ఎచ్చటైనను ఒక రూపాయి కలిసివస్తుందంటే శుద్ధముకాని విషయమునకు కూడ చేయి

చాపు చుండెడివాడు. అతడు ప్రజ లందరిచేత "ధనకాముడు" అని పిలువబడు చుండెడివాడు.

## *లోభము :*

జీవితమును ధనమునకై పరిపూర్ణముగ బలిచేసి క్రోధము, లోభము అను దుర్గుణములను ఆలింగనము చేసుకొని జీవితము నడుపుచుండెడివాడు. కోతి నోటిన యున్న ఆహారమునైనను దక్కించుకొన వచ్చునేమో కాని, ధనకాముని చేతియందున్న రూపాయి మరియొకరికి దక్కదు. ధనకాముని ఇంట ఆహారమే కాదు, నీరు కూడ ఎవ్వరునూ కోరెడివారు కాదు. బ్రహ్మచారులు, సన్యాసులు అతని ఇంట బిచ్చ మెత్తెడివారు కాదు. బిచ్చగాండ్రు కూడ అతని గృహమును వడివడిగ దాటెడివారు. ధనకాముని పిసినారితన మెట్టిదన ఎలుకలు కూడ అతని ఇంటిని బహిష్కరించినవి. పక్షులు ఆ ఇంటి చెట్లపై వ్రాలవు. కాకులు రావు. ఇంటి ప్రాకారమునందు చీమలు కూడ తిరుగవు. అంత ధనముండి అతడే, ఆహారము తగుమాత్రముగ స్వీకరించడు. ఇక యితర జీవుల గూర్చి చెప్పవలసిన దేమున్నది.

అతని పిసినారితనమునకు ఏవగించుకొని బంధువు లందరూ దూరమైరి. స్నేహితులతని కసలే లేరు. సేవకు లందరూ ఇల్లు వదలిరి. అన్నదమ్ములు బహిష్కరించిరి. కొడుకులు, కూతుళ్ళు క్రమశః అతడిపై ఆశలు వదలి, ఆస్తిపై ఆశతో అతని చావున కెదురు చూచుచుండిరి. ఇదంతయు గమనించిన అతని భార్యకికూడ ఏవగింపు కలిగి ఆమరణ

నిరాహార దీక్ష బూని దేహత్యాగము చేసినది. తన చుట్టును ఇన్ని దుష్పరిణామములు ఏర్పడుచున్నను ధనకాముడికి ధనముపై ఆశ పోలేదు.

### *బోధన :*

ఒకనాడొక సన్యాసి అతని వద్దకు వచ్చి ఇట్లు పలికెను, “నీ ధనమును దేవతల కొఱకు, పితృదేవతల కొఱకు, గురుదేవుల కొఱకు, నీ పూర్వీకుల కొఱకు, మానవుల కొఱకు వెచ్చింపవలెను. నీ ధనముపై ఐదు తెగలవారికి అధికారము కలదు. అట్లు వెచ్చింపక జీవించిన నీకు అధోగతులు కలుగును. బ్రాహ్మణ జన్మమే కాక మానవ జన్మము కూడ నీకు దక్కదు. దేవతలకు సమర్పించనిచో నీకు ధనము దక్కు అవకాశములు ఇగిరిపోవును. పితృదేవతలకు సమర్పించనిచో సంతతి యుండదు. గురువులకు సమర్పించనిచో ఆశీర్వచనముండదు. ఋషులకు సమర్పించనిచో అగ్ని ప్రమాదము, దొంగతనము ద్వారా వున్న ధన మపహరింపబడును. మానవులకు పంచనిచో పరిపాలకుల ఆగ్రహము, రోగములు ఏర్పడి నీ ధనము హరింపగలదు. నీకు ధన పిశాచము పట్టినది. నీవు ధనమును వదలనిచో నిన్నే ధనము వదులు సమయ మాసన్నమైనది. ధనమునకు కూడ నీపై ఏవగింపు కలిగినది. నీ భార్య దీక్షను బూని, తనను అగ్నికి సమర్పణము చేసుకొని పునీతయై ఊర్ధ్వ లోకములకు చేరినది. నీకు అధోలోకమే మిగిలినది.” సాధువు ఈ విధముగ నిజమును నిష్కర్షగ తెలిపి నిష్క్రమించెను.

## ధన హరణము :

ధనకాముని యందు సాధువు సద్బోధ చిగురించ లేదు. మండలము కాలము లోపల అతని ఇంట బందిపోట్లు ప్రవేశించి ధనము, బంగారము, వెండి ఎత్తుకొనిపోయిరి. మరి పది రోజులలో ఇంటికి అగ్ని ప్రమాదము కలిగెను. ఇంటిలోని ధాన్యము, దస్తావేజులు, తాను వ్రాయించుకొన్న ఋణ పత్రములు అన్నియు బుగ్గి అయినవి. తన కన్నుల ఎదురుగనే నలభై రోజులలో సమస్త ధనము, ఆస్తి హారతి కర్పూరమువలె హరించినది. ఇంటి ప్రాంగణమున గోతులలో దాచిన నిధిని త్రవ్వి తీసుకొనుచుండగ రాజభటులు పట్టుకొని పన్నులు కట్టని కారణముగ నిధిని వశము చేసుకొనిరి. ధనకాముడు దరిద్రుడయ్యెను. కరి మ్రింగిన వెలగపండు వలె అతని ధనము కాలముచే మ్రింగబడినది.

## దారిద్ర్యము :

దారిద్ర్యము ఆవరింపగ ధనకాముని శరీరమున కళ తప్పెను. శరీరము నల్లబడెను. ముఖము వికారముగ మారినది. బ్రాహ్మణ కళ అతని కెప్పుడును లేదు. వైశ్య కళ అదృశ్యమైనది. అతని ముఖమున ప్రేతకళ తాండవించుచుండెను. క్రమశః ముఖము వికృతము చెంది గుర్తుపట్టుటకు కూడ కష్టమయ్యెడిది. దుఃఖము, దారిద్ర్యము, అవమానము ముఖమున తాండవించుచున్నవి. ప్రజలెవ్వరును అతనిని ఆదరించలేదు. బంధువులు జాలి పడలేదు. తన సంతతి ఛీ పొమ్మన్నది. ఆకలికై బిచ్చమెత్తుకొంద మన్నను అతని కెవ్వరును

ఏమియు ఇవ్వలేదు. సాటి బిచ్చగాండ్రు కూడ అతనిని వెక్కిరించి తరిమి తరిమి కొట్టిరి. తన నిజ స్థితిని గమనించిన ధనకాముడు జీవించుటకు భయపడెను. నీటినుండి బయటపడ్డ చేప పిల్లవలె క్షణమొక యుగముగ విలవిల లాడెను. తోక తెగిన బల్లి వలె గిజగిజ లాడెను. కన్నుల వెంట మొదటిసారిగ నీరు జాలువారెను. అడప, దడప ఆకలి బాధకు మూర్ఛ వచ్చుచుండెడిది. మూర్ఛ నుండి తేరుకొన్నప్పుడు ఆకలిని సహింపలేక పెద్దగ ఏడ్చు చుండెడివాడు. అమ్మో! అయ్యో! అని రోదన చేయుచు నేలపై పొర్లిడుచు, విధిని తలచి సొమ్మసిల్లు చుండెడివాడు.

**అవలోకనము :**

"నేనిప్పుడే ఇంత బాధని అనుభవించుచుంటిని కదా! ఇక ముందు ఇంక ఎంత బాధ వున్నదో? ఎన్ని జన్మ లిట్లు అనుభవించ వలెనో? ఎంతమంది జీవుల ఆగ్రహమునకు గురి అయితినో? యముడు నన్నెట్టి పరిస్థితిలోనూ క్షమించడు. నన్నెవ్వరునూ సహింపరు. నాకెవ్వరును తోడు కూడ లేకుండ చేసుకొంటిని. నాకు దేవతల తోడు లేదు. పితృదేవతల తోడు అసలే లేదు. గురువుల ఆశీర్వచనము నేను ఎన్నడైనను పొందుటకు కూడ ప్రయత్నించలేదు. నాకిక మిగిలినది నరకమే. ఎవ్వరికైనను పిడికెడు బిచ్చము వేయని నావంటి కఠినాత్ములకు ఎవ్వరునూ అన్నము పెట్టరు. నాకు కనీసము జంతువులు, పక్షులు, చివరకు చీమలు కూడ సహాయము చేయవు. తెలిసి నే నేజీవికి ఉపకారము చేయలేదు. జీవులలోని నారాయణుని పరిపూర్ణముగ విస్మరించుటయే గాక అవమానించిన వాడను.

నాకెవ్వరు దిక్కు? **తనను ప్రేమించని వారిని కూడ ప్రేమించువాడు శ్రీహరియే!** అతనిది పరమ ప్రేమ కావున నావంటి నికృష్టుని కూడ అతను ప్రేమించగలడు. అతడే కృష్ణుడు, మాధవుడు, మురారి, అనంతుడు, గోవిందుడు. సకల జీవులకును ఆశ్రయము. నావంటి దుష్టునికి కూడ ఆశ్రయ మివ్వగలడు. నా పాపములను సహించి నన్నాదుకొనగల కరుణా హృదయము కలవాడు. ఓ హరీ! నీవే నాకు దిక్కు, నేను మహాపాపిని. ప్రహ్లాదునివంటి భక్తుని కాను, అజామీళుడు వంటి పాపాత్ముడను. కాదు, కాదు. నాకన్న అజామీళుడు గొప్పవాడే. అతడు కనీసము భార్య, పిల్లలనైన పోషించినాడు. నేనట్టి వాడను కాను. గజేంద్రునివలె మదించిన వాడిని. కాదు, కాదు. అతడు పూర్వ జన్మమున తపస్సుచేసిన పుణ్యమూర్తి. నేను పరివర్తనము చెందిన నీ భక్తులలో ఎవ్వరితోను సరిపోలనివాడను. నేను కరుడు కట్టిన పాపమును. నీవు కరుణ కలిగిన దేవుడవు. నీవే దిక్కు. నీ నామ స్మరణమునకు ఏమీ ఖర్చుకాదు కదా! అయినను కూడ నేను నిన్ను స్మరింపలేదు. ఏ దిక్కూలేక నీ దిక్కు చూచుచున్న స్వార్థపరుడను నేను. నన్ను కరుణించుటకు నా యందు ఏ అర్హతలును లేవు. కేవలము నీయందు గల అనుగ్రహము కారణముగ నిన్నాశ్రయించు చున్నాను. నా నీచత్వమునకు నేను సిగ్గు పడుతున్నాను.” అని బిగ్గరగా ఏడ్చుచు దైవమును తలచెను.

## పశ్చాత్తాపము :

పదే పదే తన గతము గుర్తు వచ్చుచుండగ పశ్చాత్తాపమున ధనకామునికి దుఃఖము పొరలి పొరలి వచ్చుచుండెను. అతను మరల

ఇట్లు తలచెను. “ఆహా! ఏమి నా దురదృష్టము. బ్రాహ్మణ కులమున పుట్టి ఎన్నడును దైవమును తలచలేదు. నాకు అపరిమితమైన ధనకామము ఎట్లు కలిగెనో? ఈ కామ పిశాచము కారణముగ నేను సర్వ విధములుగ పతనము చెందితిని. నా కన్న మూర్ఖు లెవ్వరు గలరు. ధనము కలిగిన దినములలో సద్వినియోగము చేయుటకు బుద్ధి పుట్టలేదు. హితులు చెప్పినను వినలేదు. ధన కామమున అంధుడనైతిని. ధనము నా జీవమును భ్రమ కొలిపి మోసము చేసినది. ఇప్పుడు నరక బాధకై భయపడు టెందులకు? నరకపు లోతు ఎవ్వరికిని తెలియదు. ఒక కల్పమంతయు ప్రయాణించినను నరకపు తుది తెలియదు అని వినియుంటిని. నేనిప్పుదిందు చొరపడుచున్నాను. కాదు, కాదు. ఇదివరకే చొరపడితిని. ధనకామ పిశాచము నన్నావరించినది మొదలు నేను నరకముననే పయనించు చున్నాను. అప్పుడు నరకమున నన్నానని తెలియని పసితనము. ఇప్పుడు తెలిసి ఏమి ప్రయోజనము. నాకిప్పుడు ప్రాపంచిక విషయములపై వెగటు పుట్టుచున్నది. కాదు, నాపై నాకే వెగటు కలుగుచున్నది. దీనికి కారణము ఇదివరకు నన్ను నేను ప్రేమించుటయే. ఇతర జీవులను ప్రేమింపక నన్ను నేను ప్రేమించుకొనుచు, వారిని అశ్రద్ధ చేసి అన్ని విధములుగ బంధింపబడి ఇప్పుడీ దుస్థితికి ఏడ్చుచున్నాను. **ధనమును ప్రేమించు మోహమున నన్ను కూడ ప్రేమించుట మరచినాను.** నా ధనాశయే ఈ మొత్తమునకు కారణము. ఆశయే పతనమునకు కారణమని పెద్దలు చెప్పిన వాక్యము నాయందు ఫలించినది. ధనాశ ఆశలలో కెల్ల బలీయమైన పతనహేతువు. హరిని క్షమించమని

వేడుటకు కూడ నాకు హక్కులేదు. ఆనందమును పొందుటకు నేను అర్హుడనే కాను. ప్రయాసపడి జీవితమంతయు కేవలము ధనార్జనము అను కామ యజ్ఞమునకు సమర్పించితినే ! అది కారణముగ నాకు హృదయమే అదృశ్యమైనది. ప్రాణ సంకట మేర్పడినది. నాకిప్పుడు బాధయే మిత్రుడు. బాధ కారణముగనే ఇన్ని సద్విషయములు ఆవిష్కరింపబడు చున్నవి. బాధ లేనప్పుడు ఈ విషయము లేవియును స్మరణయందు లేవుకదా !

# 2

# అంతర్మథనము

ధనకాముడిట్లు చింతించసాగెను.

"రణరంగమున ప్రభువు శత్రు మధ్యమున చిక్కుకొని మూర్ఛ పోయినపుడు సైనికుడొకడు ప్రాణమునకు తెగించి ప్రభువును కాపాడి కోటకు కొనివచ్చెను. తెలివి వచ్చినంతనే రాజును ప్రాధేయపడి ఒక ఎకరము పొలము అడిగి పొందెను. అడుగకున్నచో ఆ రాజు అతడి కర్ధ సామ్రాజ్యమిచ్చి గౌరవించెడివాడు. కామము చేత పీడింపబడు వాడు అడుగక యుండలేడు. అతని కడుగుట కూడ చేతకాదు. పేరు, ప్రతిష్ఠ, ఐశ్వర్యము మిక్కుటముగ దక్కు సమయమున కొంచెము బుద్ధితో తక్కువ కోరి తనను హీన పరచుకొనును. కాముకుని కన్న మూర్ఖుడు లేడు."

"సకల సద్గుణ సంపన్నయైన కన్యను దానము చేయువాడు సువర్లోకములకు అర్హుడగును. కన్యాశుల్కమును ఆశించి కన్యా దానము చేసినవాడు కేవలము అల్పమైన శుల్కమునకే సువర్లోకమును కోల్పోవును. అంతియేగాక నరకమున పడును. కన్యను కొనుటకాని, కన్యను అమ్ముటగాని జరిగిన ప్రకృతిని కించపరచినట్లే.

భక్తిపూర్వకముగ సమర్పింపవలసిన దానిని అమ్ముకొనువాడు లోభి. అట్టివానికి సుఖముండదు.”

“దానము నిచ్చువాడు తత్ఫలితముగ ఏమి ఆశించినను దాన ఫలముండదు. ఆశించి దానమిచ్చుట నీచము. అయినను కాముకుడు ఆశించక దాన మీయలేడు.”

“వేదములు, శాస్త్రములు చదివి, మహోన్నత జ్ఞానమును సంపాదించి ధనమున కాశపడువాడు పరమ మూర్ఖుడు. కీర్తి కాశపడువాడు కూడ మూర్ఖుడే. జ్ఞానమునకు పర్యవసానము ఆత్మతృప్తి, ఆత్మానందమే ధనము కాని, డబ్బు, కీర్తి కాదు. అయినను కామమను తేలుపిల్ల స్వభావమున మిగిలివున్నచో అది విషము క్రక్కి జ్ఞానమను క్షీరమును నశింపచేయును. జ్ఞానికి అహంకారము ఆపద కలిగించును. కామ మున్నచోట అహ ముండును. అహమున్నచోట ఆత్మస్తుతి, పరనింద వుండును. అది కారణముగ జ్ఞానము చెడును. దీని కంతయు మూలము ఆశయే. ధనకాంక్ష, కీర్తికాంక్ష జ్ఞానమును కూడ నశింపచేయగలవు కదా! ఆశ పవిత్రుని అపవిత్రుని చేయును. ఆశ కలవానికి తృప్తి యుండదు. తృప్తి లేని వానికి సంతోషముండదు.”

“అత్యంత సౌందర్యవతి అయిన యువతికి ముక్కుకొనపై బొల్లి యున్నచో సమస్త సౌందర్యము మరుగున పడును కదా! ఎంత సౌందర్యము కలిగియున్నను నాసాగ్రమునే యున్న బొల్లి, అందమును మరుగుపరచి వికారమును వ్యక్తపరచును. కామము కూడ నట్లే. నిజమునకు కామము మానవ జీవితమునకు పతనహేతువు. చంద్రునికి మచ్చవలె మానవునకు కామమే కళంక మగును. సమస్త

సద్గుణములను అది హరించును. కీర్తిని నాశనము చేయును. మనుష్యుని పతనము చేయును.”

“నన్ను ధనకామము పీడించినది. తల్లితండ్రులు నా కొసగిన నామము దివ్య కామ శర్మ. అది వారాశించిన పుత్రుడు. కాని యజ్ఞయాగాది క్రతువుల నాచరింపక ‘శర్మ’ అను నామమునకు అర్హతను కోల్పోయితిని. దైవమును కామించక దివ్యకాముడను నామమును కోల్పోయితిని. అమితమైన ధనకాంక్ష వలన ధన కామునిగ ఏర్పడితిని. ఇప్పుడు నేను దరిద్రుడను. నా దరిద్రమునకు కారణము ధన కాంక్షయే. ఎంతయో శ్రమపడి అహర్నిశలు ధనము నకై ఆరాటపడితిని. మిక్కుటముగ ధన మేర్పడినను తృప్తి కలుగక ధనమున కారాటపడితిని. ఆరాటము కారణముగ ఎంత ధనమును గణించినను “ఇక చాలు” అని అనిపించలేదు. ఎంత శ్రమపడితిని! అంతయు వృథా అయినది. క్రొత్త నీరువచ్చి వున్న నీటిని కూడ కొనిపోయినట్లు నా ధనకాంక్ష ధనముతో పాటు సమస్త పరివారమును కూడ కొనిపోయి నన్ను ఒంటరిని చేసినది. రాత్రింబవళ్ళు దీని కొఱకై శ్రమించితిని. ధనకాంక్ష కర్తవ్యమును మరిపింప చేసినది. మానవులకు కర్తవ్యమేకాని కామము కూడదు అని తెలియుటకు నాలుగు దశాబ్దముల ప్రాణము వృథా అయినది. ధనము కారణముగ తల్లితండ్రులను, భార్యాబిడ్డలను ప్రేమించ లేకపోయితిని. అంతియే కాదు, వారు నా ధనమును కోరుదురేమో యని ఈసడించితిని, అనుమానించితిని, దూరము చేసుకొంటిని. ఎంత దురదృష్ట వంతుడనో... ధనమును నమ్మి ఇతరములను దేనిని నమ్మలేదు. సృష్టియందు ఇక దేనిపైనను విశ్వాసము కలుగలేదు. నేను నమ్మినది

కేవలము ధనమే. అది నన్ను కాలాంతరమున విడుచునని కూడా తెలియలేదు. దీనిని కాపాడుకోవటమే పరమావధిగ జీవించితిని కాని, **కాలము నుండి, కర్మము నుండి ఎవ్వడును దేనిని కాపాడుకొనలేడని** తెలియలేదు.

సత్కార్యములకు కాని, ఇతర కార్యములకు కాని ధనము వెచ్చించునపుడు జీవునకు ఆవేదన కలుగుచుండును. తన పొట్టకు తాను తినుచున్నప్పుడు కూడ ధనము వ్యయమగు చున్నదే అనిపించు నా వంటి నీచుడెందైనను గలడా?

ధనము అనేక రకములైనటువంటి ఆందోళనలను కలిగించును కదా! ఎంతో శ్రమపడి ధనమును వృద్ధిచేసి దాని వలన దుఃఖము పొందుట ఎంత అవివేకము. ఆ పరిశ్రమ దైవము నుద్దేశించి చేసినచో ఈ పాటికి తనకు బ్రహ్మము లభ్యమయ్యేడి వాడు. జీవితము క్రీడామయముగను, వైభవోపేతముగను వుండెడిది. తానిప్పుడు పొందుచున్న ఈ బాధ, మనసున ఆందోళన వుండెడిది కాదు. ఏ రోజు కారోజు ఎట్లు గడుచునా అను భయముండెడిది కాదు. ధనమును ప్రేమించువారు మరి దేనిని ప్రేమించలేరు. తల్లి, తండ్రి, భార్య, పిల్లలను కూడ అనుమానింతురు, అవమానింతురు కూడ. ధన రక్షణ భావముతో ఎవరినీ విశ్వసింపలేని దుస్థితియందు వుందురు. ధనము కారణముగ బంధుమిత్రాదులను కోల్పోయి ఒంటరి యగును. తనను ఒంటరిగ చేసి, తన ధనము తనను విడిచిపోయెను. ముందుగ విడిచిపోయిన బాగుండెడిది. తన వారి నందరిని దూరము చేసి తనుకూడా దూరమై నన్ను ఇన్ని విధముల భ్రష్టుని చేసినది.

# 3

# ధన దోషములు

ధనకాముని కిపుడు ధన దోషములు ఒక్కొక్కటిగ తెలియ సాగినవి, అవి :

1. అక్రమార్జిత ధనము దోషములను తెచ్చిపెట్టును. అట్టి ధనము పెరిగిన కొలది మనిషి సంస్కారములో దోషములు పెరిగి సంస్కారములు తగ్గును. అక్రమముగ ధనమును ఆర్జించుట యనగ దొంగతనమే. దొంగకు భయము సహజము. తను దొంగయని తనకెప్పుడును తనయందలి సత్యము గుర్తు చేయుచుండును. తనను దొంగయని సంఘము గుర్తించునేమో అను భయము వెంటాడు చుండును. నీవు దొంగవు కదా! అని ప్రతి క్షణము ఆత్మసాక్షి వెక్కిరించుచుండును. తనవంటి వారు ఎక్కడైన పట్టుపడినప్పుడు తన గతి కూడ అదియే యగునేమో అని భయముండును.

కొందరు భౌతికముగ దొంగిలింతురు. కొందరు తెలివితో దొంగిలింతురు. తెలివిగలవారు తెలివి లేనివారిని దోచుకొను దొంగతనము కలదు. ఆపదలందున్న వారి నుండి అవకాశమునుబట్టి వీలైనంత రాబట్టుకొనుట కూడ దొంగతనమే. ఇతరులకు తనతో

పని పడినప్పుడు వారి వనరులను తనవిగ దుర్వినియోగము చేయుట కూడ దొంగతనమే. ఆకర్షణీయమగు పథకములు, స్కీములు, లాటరీలు పెట్టి సామాన్యులను వంచించి సంపాదించుట దొంగ తనము. వ్యాపారమున దొంగతనములకు అవకాశము మెండు. **మానవ జీవిత మంతయు ఒకరి నొకరు దోచుకొనుచు బ్రతుకుటగ కనిపించు చుండును.** మహాభారత కథ యంతయు ధార్తరాష్ట్రులు-పాండవుల సంపద, రాజ్యమును అపహరించు ప్రయత్నమే కదా! దీనివలన దుఃఖమే మిగులును. పతనము అనివార్యము.

"ఈ ధనమున కెంత ఆకర్షణ కలదు. కోట్లాది జీవులను వెట్టివారలుగ చేసి తన చుట్టు త్రిప్పుకొనుచున్నది. తనది కానిది తనది చేసుకొనుట అను స్వభావము కారణముగ ధన వ్యాపారము మొదలై దొంగతనమునకు దారి తీయుచున్నది కదా ! మార్గమున అనాయాసముగ దొరికిన దానిని పొగొట్టుకొనిన వానికి అందించు సంస్కారము ఎందరికి కలదు?"

నరకమున పడుదుము అని తెలిసియు కూడ ధనము విషయమున మనిషి వివశుడై, వెంటపడుచుండును. చివరకు సజ్జనులు, సత్పురుషులు, సన్యాసులు కూడ దీనిచే జయింపబడు చున్నారు. ధనార్జనకై వివిధములైన వేషములు వేయు సన్యాసులు మెండు. ఇది వీరముష్టి! సజ్జనులు, సాధువులు అయిన సన్యాసులు కూడ క్రమముగ ధనమునకు లోబడుట జరుగుచునే యున్నది. ధన సముపార్జనమునకై ప్రతి ఒక్కరును వారి వారి స్థాయిలలో వంచనకు గురియగు చున్నారు. వంచించు చున్నారు. ధనమున్నచోట

దొంగబుద్ధి వుండక తప్పదు. ధనార్జనమునకు మారుపేరు దొంగబుద్ధి యగుచున్నది. ధనకాముడు దొంగ అవక తప్పదేమో!

2. దొంగతనము మొదటి దోషము కాగా, ధనమునకై హత్యలు చేయుట రెండవ దోషముగ తోచినది. ధనమునకై కీచులాడుదురు, కొట్లాడు కొందురు. కొట్లాటలు తీవ్రమై ఒకరి నొకరు చంపుకొందురు కూడ. ధనమునకై తోటి సోదరులను చంపుట, తండ్రిని చంపుట, భార్య భర్తను, భర్త భార్యను చంపుట సంఘమున జరుగుచునే యున్నది. ధనమునకు ఆకర్షింపబడిన వాడు క్రమశః క్రూరుడై హత్యలను గావించుటకు కూడ వెనుకాడడు కదా! ధనము కుటుంబమును విడదీయ గలదు. భార్యా భర్తలను కూడ వేరు చేయగలదు. పదినెలలు తనను మోసి, కని పెంచిన తల్లిని, ధనము కారణముగ భార్య మాటవిని కొడుకు విసర్జించగలడు. ఈ ధన కామము ఎంత శక్తివంతము. ధనార్జనమున సంస్కారములు కుంటుపడుట సహజము. అవి మృగ్యమై మనిషి హంతకుడు కూడ అగుచున్నాడు.

3. మూడవ దోషము అసత్య భాషణము. ధనముపైన ఆశ కారణముగ మనిషి ఎన్నియో అసత్యము లాడుచున్నాడు. ధనాశ యను గర్భము నుండి జనించిన పుత్రికయే అసత్యము. ధనము పెరిగినకొలది అసత్యభాషణము బలవంతము, శక్తివంతము అగు చున్నది. అసత్యము - ధనము కవల పిల్లలవలె ఒకదాని వెంట మరియొకటి నిలచియుండును. **ఎక్కడ ధనమున్నదో అక్కడ అసత్య**

**ముండును.** ఉత్తమోత్తమ సంస్కారవంతులు తప్ప అసత్య భాషణ దోషములేని సంపద, సంపాదన యుండదు. అసత్యమను దోషము నకు దానిదైన పరివారము మిక్కుటముగ కలదు. ధనము వలన అసత్యము, బద్ధకము, నిర్లక్ష్యము, నింద, ఇత్యాది దోషములు కోకొల్లలుగ పుట్టుకొచ్చు చుండును. ధనమున్నచోట సత్యమునకు తావులేదు. ధనము కొఱకై సామాన్యులు కూడ వారి దైనందిన వ్యాపారమున అసత్యము లాడుదురు. మిక్కుటముగ అక్రమార్జనము చేసిన పండితులు, వేదాంతులు కూడ ధనమును కాపాడుకొనుటకు అసత్యభాషణమునకు వెనుదీయరు. వేదమును సరిగ నుచ్చరించ లేకపోయినను ధనము కొఱకై తాము వేదాంతుల మని, వేద పండితుల మని నాలుక నొప్పి లేకయే పలుకుదురు. వారికిని, వీరికిని లంచమిచ్చి తమను జ్ఞానులుగ, వేదాంత పండితులుగ సంఘమున స్థాపించుకొనుటకు ప్రయత్నింతురు. రాజులు, పండితులు, సాధువులు ధనకామమునకు లోబడినా రనగా ఇక యితరుల విషయము చెప్పనేల?

పుట్టలు పుట్టలుగ కోరికలు కలిగియు, వాటిని తీర్చుకొనుటకై ధనము నందు రతి కలిగియు తాము భక్తుల మని, దైవచింతన కలవార మని, ధర్మజ్ఞుల మని, ధనము తమకు తృణప్రాయమని దంభములు పలుకుచుందురు. మానవుడు ధనము కొఱకై అనంత కోటి ఉపాయములను ఆలోచించుచు అనేకానేక వేషములను వేయుచుండును. అసత్యభాషణమే ధనార్జనమునకు మొదటి అర్హత. ధనాశ కారణముగ అసత్య భాషణమను విద్యయందు అత్యంత

నేర్పును మానవుడు పొందుచున్నాడు. సత్యమునకై మూడు లోకము లందును దేనినైన త్యాగము చేయుట శాశ్వత ధర్మమై నిలచియుండగ, ధనమునకై మూడు లోకముల యందు అసత్యభాషణ కారణముగ సమస్తమును కోల్పోవుట జరుగుచున్నది కదా!

ధనాశ – అసత్యభాషణము అను జంటపాముల నడుమన జీవుడు బిగింపబడి అధమాధమ స్థితికి జారుచున్నాడు. ధనము అసత్యమును బలపరచగ, అసత్యము ధనమును బలపరచుచున్నది. ఇట్లు యిరుప్రక్కల నుండి క్రిందకు త్రోయబడుచుండగ జీవుడు మైమరచి, మోహమున ఏమియో పొందుచున్నవానిగ గాలిని ప్రోగు చేసుకొనుచు, నిర్జీవమైన జీవితము సాగించుచున్నాడు.

ధనాశ లేనివానికి, అసత్యమాడు నవసరముండదు. ధనము కావలెనా? అసత్యమాడక తప్పదు. ఇది లోకరీతి. ధర్మము నాశ్రయించి, లభించిన దానికి సంతృప్తి జెందుట ఒక్కటియే నీతి. ఆశించుట మొదలిడెనా, అంతయూ పతనమే. **సంస్కారపరముగ పతనము చెంది, లోకపరముగ పెరిగిన ఏమి లాభము?** ఆ పెరుగుదల పేకమేడల వంటిది. కాలము రూపమున సమస్తము కుప్పకూలినట్లు కూలిపోగలదు.

ధనకాముని యందు ఈ విధమగు భావములు జనించి తన అసత్య భాషణా దోషములను ఎత్తి చూపి, అతనిని వెక్కిరించినవి.

ధనము లేనివానికి దొంగ భయము లేదు. దొంగ కూడ ధనములేని వానిని చూచి భయపడును. కారణమేమన తనను

పేదవాడు ధనమడుగునేమో యని భయము. ధనము కోసము మనిషి దొంగయగుట జరుగును. దొంగతనములు పలురకములు. దారి కాచి దోచుట, ఒంటరి వానిని భయపెట్టి దోచుట, దారియందు దొరికిన దానిని తనదిగ చేసికొనుట, ఇతరుల సొమ్మున కాశించుట.

వ్యాపారము పేరున తెలివిగ దొంగలించుట కూడ దొంగతనమే. ప్రజలను మభ్యపెట్టి సంపాదించువారును దొంగలే. ప్రలోభములు కలిగించు వ్యాపారము కూడ దొంగ వ్యాపారమే. ప్రజాశ్రేయస్సు ధ్యేయముగా లేని వ్యాపారములు, మిక్కుటముగ లాభము కోసము చేయు వ్యాపారములు– దొంగ వ్యాపారములే. ప్రజలకు అపకారము కలిగించు వ్యాపారములు హీనములు. ప్రజా శ్రేయస్సు గుర్తించని వారు సంస్కారము లేనివారు. ధనముకోసము చేయు వ్యాపారము లన్నియు ధర్మపరముగ చూచిన దొంగతనములే.

ధనముకోసము అధికార దుర్వినియోగము చేయువారు కూడ దొంగలే. పలుకుబడిని డబ్బుకు అమ్ముకొనుట కూడ దొంగతనమే. నిజమునకు ధనాశ వున్నచోట సమస్తమును ధనము కొఱకు నిర్వర్తించుట జరుగును. విద్య, వైద్యము, సద్బోధలు అన్నియును కూడ ధనాశ కలవాడు నీచముగ ఉపయోగించగలడు.

ఎక్కడ ధనమెక్కువుగ నున్నదో అచ్చట దొంగతనము కూడ ఎక్కువగ వుండును. ధనము కలిగించు పతనము మరి ఏదియు కలిగించలేదు. పతనమునకు ఆశ కారణము. సర్వసంగ పరిత్యాగిని కూడ ధన మాకర్షించ గలదు.

ధనమునకై హత్యలు చేయుట జరుగుచుండును. దేశములను ఆక్రమించుట కూడ ధనమును దోచుటకే. మహా యుద్ధములు చాల భాగము ధనము కొఱకే జరిగినవి. ధనము కొఱకు ప్రాణస్నేహితులను మోసగించుట, చంపుట కూడ జరుగుచుండును. కుటుంబమునందు కూడ కలహములు ధనాశ కారణముగ కలుగ గలవు. హత్యలు కూడ జరుగ గలవు. భర్త యనియు, భార్య అనియు, తల్లితండ్రులనియు, అన్నదమ్ములనియు భావింపక, ధనము కొఱకు కీచులాడుకొనుట, కోర్టుల కెక్కుట, చంపుకొనుట కూడ జరుగుచున్నది కదా!

ధనార్జనము - అసత్య భాషణము కవల పిల్లల వంటివి. ధనమున్నచోట దొంగతనము, హత్యలే కాక అసత్యభాషణము మిక్కుటముగ వుండును. **మానవజాతిని అసత్యమున కూలద్రోసిన ఘనత ఎక్కువగ ధనమునకే దక్కును.** అసత్య భాషణమే ధనమును విపరీతముగ పెంచగలదు. ధనము అసత్యభాషణమును పెంచును. కొడుకు తండ్రితో ధనకారణముగ అసత్య మాడగలడు. అటులనే భార్య భర్తతోను, స్నేహితుడు స్నేహితునితోను అసత్యము లాడుచుందురు. అమ్మకము, కొనుగోలుల యందు కూడ అసత్యమే ప్రధానముగ తాండవ మాడుచుండును. తోటకూర అమ్ముకొనువానినుండి బంగారము అమ్ముకొనువారి వరకు అసత్యము లాడవలసినదే. డబ్బు కొఱకు వేరుశనగకాయ లమ్ముకొను వారి నుండి వేదములు చదివిన వారుకూడ అబద్ధము లాడుదురు. ధనాశ సమస్త పతనమునకు కారణమని ధనకాముడు పై విధముగ శోధించి సంభ్రమాశ్చర్య చకితుడయ్యెను.

4. మోహము, భ్రమ కలిగించుట, మోసము చేయుట అను వ్యసనములు కూడ ధనాశ వలన కలుగును. భక్తుల మని, యోగుల మని, గురువుల మని భ్రమపెట్టి ధనము సంపాదించుట జరుగు చున్నది కదా! ధనము కొఱకై తిరునామములు, విభూది పట్టీలు పెట్టుకొనుట, రుద్రాక్షమాలలు, తులసి మాలలు ధరించుట, ధనము కలవారిని శిష్యులుగ నేర్పరచుకొనుట, ఇత్యాది రోగము లన్నియు ధన సంపాదనమను కీటకము మనసును తొలుచు చుండుట వలననే మోసపు గురువులు పదవిలో గలవారిని, ధనవంతులను ప్రత్యేకముగ ఆకర్షింపజూతురు. వారి ప్రవర్తనమున సమభావముండదు. పేదవారిని అశ్రద్ధచేయుచు, పలుకుబడి కలవారిని అందల మెక్కింతురు. వారి యందు ప్రత్యేక శ్రద్ధ చూపుట, వారికి ప్రత్యేక రహస్య ఉపదేశములు చేయుట, చేయుచుందురు. వారిని భ్రాంతియందు పెట్టి తమ ప్రణాళికను నిర్వర్తించు కొందురు. త్యాగమును గూర్చి పదే పదే బోధనల యందు పలుకుచు ధనవంతుల డబ్బును, ఆస్తులను, వారి సర్వస్వమును జలగలవలె పీల్చి త్రాగు చుందురు. ప్రపంచమునకు తాము సత్పురుషుల మని వార్త లందించుచు కపటులై, స్వార్థపరులై, తమదైన సామ్రాజ్యముల నేర్పరచు కొందురు. ధనము విశేషముగ సేకరించిన కపట యోగులకు సాయుధ భటులావశ్యక మగును.

ఇట్టి గురువులను మించి వారి శిష్యులు వికారముగ తాండవ మాడుచు గురువు పేరున వీలున్నంత దండుకొనుచుందురు. తాము గురువుకు సన్నిహితులమైన శిష్యులమని భ్రమ కల్పించి, వినయమును

నటించి, ఆషాఢభూతులవలె ఇటు గురువును అటు ప్రజలను కూడ దోచుకొనుచుందురు. ఇట్టివారు మితిమీరిన తెలివితేటలతో, మితి లేని దాహముతో తమ స్వార్ధమును చూచుకొను చుందురు. గర్వబోతులై సామాన్యులను హింసించుట, అవహేళన చేయుట, నిర్లక్ష్యము చేయుట పరిపాటిగ నుండును. అవసరమైనచో ఇట్టివారు గురువును హత్య చేయుటకు కూడ సందేహింపరు.

మంత్రములు, తంత్రములు, వేదములు, నాదములు, భక్తి, యోగము అను అత్యుత్తమమైన అంశముల చుట్టును ధనము చేరినచో సమస్తము భ్రష్టమగును. దివ్యమైన విషయములకు ధనమొక యోజనము దూరమునం దుండవలెను. ఒక విషపు బొట్టు చిక్కని పాల నెట్లు నశింపచేయునో ధనకామము సద్బుద్ధిని, సత్కులమును, సత్ప్రవర్తనమును, సంస్కారమును, సాంప్రదాయమును పరిపూర్ణముగ నాశనము చేయగలదు కదా! అని తలచి తలచి ధనకాముడు చకితుడయ్యెను.

5. ధనాశ, ఇంద్రియ లోలత్వమును కూడ కలిగించును. అధికముగ ధనము చేరిన, మనిషి మిక్కుటముగ సౌకర్యములను ఏర్పరచుకొని వాటికి లొంగును. ఇంద్రియ భోగములకు, దేహ సౌకర్యములకు బానిస యగును. అట్టి సౌకర్యములు లేనప్పుడు దుఃఖము చెందును. భోగములు మితిమీరగ మనస్సు పరిపరి విధములుగ దురభ్యాసములకు లోనగును. కామము మితిమీరి పెరుగును. ఇంద్రియ లోలత్వము వలన బుద్ధి మందగించి మనిషి పెడత్రోవ పట్టును.

ధనము వలన కలుగు ఐదవ పతనము ఇంద్రియ లోలత్వమని ధనకాముడు తెలుసుకొని దుఃఖించెను.

6. భోగ జీవనమునకు లొంగిన మనిషి సౌకర్యములు లేనపుడెల్ల అమితముగ కోపగించును. అతిథిగ, అభ్యాగతుల యిండ్లయందు వున్నప్పుడు కూడ తనకు సౌకర్యములు లేవని అమర్యాదగ ప్రవర్తించును. ఇంద్రియ పరితృప్తి కలుగనపుడెల్ల అతనియందు కోపము చెలరేగును. కోపము సమస్త సద్గుణములను కాల్చివేయును. మితిమీరిన ఆగ్రహముతో అసభ్యముగ ప్రవర్తించి, మిత్రులను కోల్పోవును.

7. ధనము వలన కలుగు ఏడవ అపాయము గర్వముగ ధనకాముడు గుర్తించెను. ధనమదము గల యిండ్లలో పెద్దలకు గౌరవ ముండదు. సాధుజనులు అవహేళన చేయబడుదురు. అసమర్థులే సాధువులుగ నుందురని మదముతో పలుకుదురు. ధన మదమునకు కొంత జ్ఞానముకూడ తోడైనచో అపాయము మరింత హెచ్చుగ నుండును. అట్టివారు తమ సద్గురువు యెడల కూడ వినయముగ ప్రవర్తింప లేరు. గురు బోధలను అశ్రద్ధ చేయుట జరుగును. గురువును ఎగతాళి చేయుట కూడ నుండును. సద్గురువు నందు లోపము లెన్నుట యుండును. తన గురువు కన్న తానే తెలివైనవాడినని భ్రమ చెందును. గర్వము కలవారు ఇతరులయందు లోపములు ఎత్తిచూపుచు జీవించుచుందురు. ఇతరుల యందలి మంచిని గమనించరు. ఎవరైనను ఇతరులలోని లోపములను తెలిపినచో వాటిని సమర్థింతురు. సద్గుణములు తెలిపినచో ఖండింతురు. గర్వము

కారణముగ సామాన్యుల యందలి మంచిని గుర్తింపరు. పెద్దలకి తలవంచి నమస్కరింపరు. తలబిరుసు కారణముగ మహాత్ములను కూడ నిందింతురు. దైవమును, ధర్మమును లెక్కచెయ్యరు.

గర్వబోతులు సేవా కార్యక్రమము చేసినచో వాటినుండి సేవకన్న గర్వమే ఎక్కువగ తొణికిస లాడును. తమ సేవను గూర్చి తామే పొగడుకొనుట, ఇతరుల సేవను దూషించుట చేయుదురు. మత్తెక్కి పశువులవలె ప్రవర్తించి పెద్దల ఆగ్రహమునకు గురి యగుదురు. నలకూబర మణిగ్రీవులు ధన మదముచే నారదుని శాపమునకు గురికాబడిరి గదా! పై విషయము గమనికకు వచ్చి తన ధన మదమునకు తానే చింతించసాగెను.

8. ధన మదమున అహంకార మేర్పడి మనిషి క్రమశః అపవిత్రు డగును. అదుపు తప్పును. నియమములను అటకెక్కించి దుర్వ్యసనముల పాలగును. ఉచ్ఛనీచముల మరచును. తినగూడనివి తినుట, త్రాగకూడనివి త్రాగుట, కలువగూడని వారిని కలియుట జరుగును. గాడిదవలె ప్రవర్తించును. కామాంధుడై కులస్త్రీల వెంట, విధవల వెంట, వేశ్యల వెంట తిరుగాడును. పాపభీతి మరచును. త్రాగినవారికి మత్తు కొంతసేపే యుండును. ధన మదమున మత్తెక్కిన వారికి, వారిని సర్వనాశనము చేయువరకు మత్తు దిగదు. తనను తాను మోసగించుకొనుచు నశించును.

ఈ విధముగ చింతించుచు ధనకాముడు ఆకలి కారణముగ కొంతసేపు మూర్ఛిల్లి తేరుకొనెను.

9. ధనము మనుష్యులను వేరుచేయును. ఇది మరియొక అపాయము. తన ధనము ఇతరులు కోరుదురేమోనని తన వారైన వారికి కూడ చాలా విషయములు తెలుపక దాచి యుంచుదురు. అవసర మున్నను బంధువులకు, స్నేహితులకు సహాయము చేయక వారందరికి దూర మగుదురు. ఎవరు తన దగ్గరకు వచ్చినను ధన మాశింతురేమో అను భయముచే జీవింతురు. తమకు తాముగనే అందరికి దూర మగుదురు. ఒంటరిగ జీవింతురు. తన భార్య సహితము తనను అసహ్యించుకొని పోయినది కదా! ఎంత నికృష్ట జీవన మిది. ధనకాముడు ఈ విధముగ ధనముయొక్క తొమ్మిదవ అపాయమును గుర్తించెను.

ధనవంతుని యందు అపనమ్మకము బీజమై నిలచి మహా వృక్షముగ పెరుగును. ధనము కలవాడు సులభముగ ఇతరులను నమ్మడు. సోదరులను, స్నేహితులను కూడ నమ్మడు. తన నుండి పుట్టుకొచ్చిన సంతానమును కూడ నమ్మడు. అగ్నిసాక్షిగ పెండ్లాడిన భార్యను నమ్మడు. సద్గురువులను కూడ నమ్మడు. అందరియందు అనుమానము, అపనమ్మకము కలిగి జీవించును.

అవిశ్వాసమే సమస్త పతనములకు కారణమని పురాణములు ఘోషించుచున్నవి. నమ్మినవాడు చెడడు. నమ్మనివాడు బ్రతుకు దుర్భరముగ జీవించును. నమ్మనివాడు దైవమును కూడ నమ్మడు. అవిశ్వాసము కారణముగ దయ, కరుణ, ప్రేమ ఇత్యాది దివ్య గుణములు అదృశ్యమగును. కఱకు మనసు కలిగి ప్రవర్తించును. నమ్మకములేని వాని జీవితము ఎడారి జీవితము. అపనమ్మకము

కలవాడు మొదలు నరకిన చెట్టువలె నశించును. క్రమశః తన అపనమ్మకము ద్వేషరూపము దాల్చి సమస్తమును ద్వేషించుట జరుగును. తన విషయమునందట్లే జరిగినది. తనకు ధనము కారణముగనే వివేకము నశించినది. ఆత్మనియతి చెడినది. ఆత్మశాంతి మృగ్యమైనది. తన కేర్పడిన అపనమ్మకమును గమనించి ధనకాముడు అంత నీరసము నందును నవ్వుకొనెను.

ధనకాముడు ఇంకను ఆలోచింపగ అవినీతి, జూదము, త్రాగుడు మిగిలిన అపాయములుగ గుర్తించెను. స్త్రీ కామము, ధనకామముతో కూడినచో సర్వము బూడిద యగునని కూడ తెలుసుకొనెను. తన అదృష్టముకొలది స్త్రీ కామము, జూదము, త్రాగుడు తన కబ్బలేదు.

పై విధముగ ధనము వలన తనకు కలిగిన దుర్దశకు దీర్ఘముగ చింతించి **సత్పురుషునకు ధనార్జనము ధ్యేయము కాకూడదని** తెలుసుకొనెను. దైవభక్తులు దైవమువెంట పడవలెను కాని ధనమువెంట పడరాదని తెలుసుకొనెను. సాంబ్రాణి పొగకు ఈగలు పారిపోవును. నూనె వాసనకు నల్లులు పారిపోవును. నిప్పుకు చీమలు పారిపోవును. అట్లే సత్పురుషుని సంస్కారమునకు ధనాశ ఆమడ దూరమునం దుండవలెను. **మోక్షము కోరువారికి ధనాశ విషము వంటిది.** ఇట్లు క్రమశః ధనకాముని మనసునందు వివేకము తొంగి చూడసాగెను.

# 4

# ఉషోదయము

సత్పురుషునకు, సత్కుల సంజాతునకు ధనాసక్తి పతనమునకు కారణము. పూర్వపుణ్య విశేషముచే సంపద చేరినను సత్పురుషులు వానిని పంచిపెట్టుచు, జాగ్రత్త పడవలెనని కూడా ధనకాముడు గ్రహించెను. దైవమును గూర్చి, దైవకార్యములను గూర్చి సంపన్నుడు ధనమును విరివిగ నీయవలెను. పితృదేవతా ఆరాధనమున కూడ విస్తృతముగ ధనమును పంచవలెను. తల్లిదండ్రులకు అవసరమగు ధనమును సమకూర్చుటలో నిర్లక్ష్యముండరాదు. వారికి ధనలోపము లేకుండ కడు శ్రద్ధతో చూచుకొనుచుండవలెను. సాధుజనులకు, సద్బ్రాహ్మణులకు ఆంతర్యము లేక ధనమందించు చుండవలెను. పేదవారికి, కష్టములలో నున్నవారికి ధన సహాయము చేయుటకు ఉన్ముఖుడై యుండవలెను.

ఇట్లు దైవమునకు, పితృదేవతలకు, తల్లిదండ్రులకు, సాధు పురుషులకు, పేదవారికి పంచిన ధనము మోక్షకారణ మగును. కుంటి, గ్రుడ్డి ఇత్యాది అంగవైకల్యములు కలిగిన పేదలను ప్రత్యేక ముగ ఆదరింపవలెను. **అన్నదానము, వస్త్రదానము, విద్యాదానము,**

**వైద్యదానము చేయుట సంపన్నుని కర్తవ్యము.** అట్లు చేయని సంపన్నుడు ధనముచే బంధింప బడగలడు. తన కులము వారిని, తన జాతి వారిని, అతడు వంచించిన వాడే కాని, ఆదుకొనినవాడు కాడు. ఈ విధముగ ధనకాముడు ఆత్మవిమర్శ గావించుకొని పశ్చాత్తాపము చెందుచు, ఆకలిదప్పులకు అవమానములకు ఓర్చుకొనుచు, జీవించసాగెను. **నిజమునకు ధనము ఏ సుఖమును ఈయలేదని** తెలిసినది. తను ధనము కోల్పోవుట ఒక రకముగ మేలుచేసినది అను భావము మనసున పొడచూపినది. అది తనకు దైవమిచ్చిన ఆశీర్వచనమనే భావన మెరసినది. తనను రక్షించుటకే కరుణామయుడైన భగవంతుడు తనకీ ధనములేని స్థితిని కలిగించెనని తెలుసుకొని స్థిమిత పడసాగెను.

ధన స్వరూప స్వభావములను పూర్తిగ ఎరిగిన ధనకాముడు పశ్చాత్తప్తుడై ఇట్లు భావించెను. "ధనము పోయిన వెనుక తెలివి వచ్చినది. ధన మున్నప్పుడు వినియోగము తెలియలేదు. మనస్సును, వాక్కును, దేహమును ధనార్జనమునకై దుర్వినియోగము చేసితిని. మత్తెక్కి బ్రతికితిని. నిజమైన ధనమేదో తెలియరాలేదు. నేను మోసగించి సంపాదించిన దంతయూ నన్ను మోసము చేసి వెడలినది. ధన మున్నంత కాలము ఆందోళనతో బ్రతికితిని. ఇపుడు ధనము పోవునేమో అన్న చింత లేదు. ధనముండిన కదా చింత! జీవితమున ధనముతో పాటే, చింతకూడా పోయినది. తెరిపిగ నున్నది. పిసిని గొట్టు జీవితము- ఎంత దుర్భరముగ జీవించితిని. నా ధనార్జన కార్యక్రమ మంతయూ, ఒక దుస్స్వప్నమువలె గోచరించుచున్నది. ధనముతో మునిగిన నన్ను దరిద్రుని చేసి దైవము నాకు మేలు చేసినాడు. జీవితమున సగభాగము వ్యర్థముగ గడచినది. ఇపుడే

నవజీవనము ప్రారంభము కాగలదు. నే నిపుడేమీ లేనివాడనైననూ తెలియని తృప్తి యొకటి ఉత్పన్న మగుచున్నది. మాయా జీవనము నుండి మెలకువ వచ్చినట్లు గోచరించుచున్నది. ఇది గోవిందుని అనుగ్రహ మనిపించుచున్నది.

**భోగ జీవన మంతయు స్వప్నమే.** అందు జీవించుచుంటి ననుకొంటిని. ప్రతి క్షణము మరణించుచూ జీవించు జీవనము ఒక జీవనమా? అందు చచ్చుట జరుగక గోవిందు డనుగ్రహించి నాకు దరిద్రము రూపమున మెలకువను కల్పించినాడు. ధనమెట్టి సుఖమూ ఈయజాలదు. అది దేహమునకు సుఖము నిచ్చునేమో కాని జీవునికి నిస్పందేహముగ పతన కారణమే. ఈగలను తిను కప్ప తానేమో తినుచున్నానని గర్వించుచున్ననూ, తనను సర్పము మ్రింగుచున్నదని తెలుసుకొనదు కదా! నా జీవితమట్లే అయ్యెను. కాలమను సర్పముచే మ్రింగబడుచూ అది తెలియక డబ్బు లను ఈగలను తినుచూ జీవించినాను. ఈ అవివేకమునకు ఇక స్వస్తి.

జీవునకు దేహమును, ఇంద్రియములను, మనస్సును దైవ మిచ్చినది, జీవుడు తన నిజ స్వరూపమును తెలుసుకొని జీవించుటకే కాని, భోగపరమైన విషయముల యందు మరణించుటకు కాదు. దేహేంద్రియములను కాలము హరించ గలదు. ఇంత లోపలనే జీవుడు వివేకవంతుడై తన అమృతత్త్వమును సాధించుకొనవలెను. లేనిచో దేహము హరింపబడుట జరుగును. దాని నెవ్వరును ఆపలేరు. స్వానుభవమున నాకీ విషయము తెలిసినది. మాయామయమగు **ఈ జగత్తునందు నీతి నియమములతో ప్రవర్తించుటయే కర్తవ్యము.** నేనిప్పుడు వివేకముతో కర్తవ్య సాధనమున నన్ను నేను ఉద్ధరించు

కొందును. గోవిందుని అనుగ్రహము కలిగి, వివేకము జనించినది. వైరాగ్యము కలిగినది. ఇక జ్ఞాన సముపార్జనమునకు మార్గము సుగమమైనది. **జీవుల అజ్ఞానమును హరించి వివేకము నుదయింప చేయుట హరి సంకల్పమే.** హరి సంకల్పముగ నా మనస్సిప్పుడు సరియగు ఆలోచనా విధానమును పొందుచున్నది. ప్రాపంచిక విషయముల యందు అసంగత్వ మేర్పడుచున్నది.

**ధార్మిక జీవనము, ప్రాపంచిక విషయానురక్తి పొసగని విషయములు.** హరి కృప వలన నా మనస్సిప్పుడు, ధార్మిక జీవనమునకు మ్రొగ్గు చూపుచున్నది. ఇపుడిపుడే హృదయమున వికాసము కలుగుచున్నది. దైవ మెంతటి కరుణామయుడు! నన్ను ధర్మ మార్గములోనికి ఉద్ధరించుటకై, దరిద్రుని చేసి వివేకము కలిగించి విరాగిని చేసినాడు. అతని నేర్పు వర్ణించుటకు బ్రహ్మాది దేవతలు కూడ అశక్తులే. **ఇచ్చుట యందు, మరల తీసుకొనుట యందు శ్రీహరి నేర్పు ఊహాతీతము.** హరి స్వరూప స్వభావములు ఎవరెరుగ గలరు? నాకిప్పుడు అతని అనుగ్రహ స్వరూపము తెలియుచున్నది. పాప పంకిలము నుండి నన్ను కడిగి ఈవల పడవైచినాడు. సంసార మనెడి శ్లేష్మము నందు పడిన ఈగను రక్షించినట్లు రక్షించినాడు. చక్రధారియగు గోవిందుని రక్షణమున నేనిక జీవింతును గాక! ఇకపై నా జీవనము ధార్మికముగ జీవించెదను. హరికి సమర్పణము చెంది యుండెదను. ప్రహ్లాదుడు, అంబరీషుడు మొదలగు వారే నాకు ఆదర్శవంతులు, మార్గ దర్శకులు.

# 5

# ధనకాముని హరిభావము

**హ**రి నెరుగుట దుర్లభము. అతని నెవ్వరును నిర్వచింపలేరు. వేదములే పరిపూర్ణముగ స్తుతింప లేకపోయినవి. **హరి కృపను తెలియగలము గాని, హరిని తెలియలేము.** పాపములను హరించు వాడే హరి. దయగలవాడే హరి. జ్ఞానమను దీపమును వెలిగించువాడు హరి. జగత్తును రక్షించువాడు హరి. పోషించువాడు హరి. సమస్త దేవతలును అతని పాదములనుండి పుట్టినవారే. అతని నెదిరించి నిలుచువా రెవ్వరునూ లేరు. దేవతలు సైతము అతనిని ప్రార్థించు చుందురు. అతని భక్తులను దేవతలు కూడ నశింప చేయలేరు. అతనికి ప్రతికూలముగ ఏదియును నిలువదు. అతని భక్తుల విషయములందు కూడ అదే సత్యము నిరూపింపబడినది. సర్వదేవతా స్వరూపుడే హరి. సమస్త రూపములయందు హరియే వున్నాడు. అందుచే నాకిక ఎవ్వరునూ ప్రతికూలురు లేరు. సమస్తము హరియే అయినప్పుడు నాకిక బాధయే లేదు.

ఈ జన్మమున నాకు హరి కృప కలుగుటకు నే నే పుణ్య కార్యము చేయలేదు. అయినను నన్ను శ్రీహరి అనుగ్రహించినాడు.

అతని అనుగ్రహమునకు కారణమతనే ఎరుగవలెను. నే నెరుగను. బహుశ ఏ జన్మములోనో ఒకించుక పుణ్యకార్యము చేసితినేమో? దాని నాధారముగ గొని హరి సంతసించి నాకిపుడు తన అనుగ్రహ మును ప్రసరింప చేసినాడు. చేసిన అపకారములన్నీ మరచి ఒకించుక చేసిన ఉపకారము నాధారముగ అనుగ్రహించుటయే హరి కారుణ్యము. ఇక నా జీవనమునకు మిగిలినది హరి భక్తియే. అదియే నాకు వివేక వైరాగ్యములను ప్రసాదించి ఇకపై జీవనమును నడిపించుగాక.

## *ధనకాముని నిశ్చయము :*

ఇకపై జీవనము ఒక్క క్షణముకూడ వ్యర్థము చేయను. సుఖ దుఃఖములకు లొంగను. హరి నామమును ఆధారముగ చేసుకొని పుట్టని, చావని గతి పట్టెదను. **మనసున స్ఫూర్తి కలదుగాన నాకు వార్థక్యము లేదు.** స్ఫూర్తి గల మనసే దేహమును కూడ చైతన్య వంతము చేయగలదు. స్ఫూర్తివంతమైన మనసుతో దైవమున నిలచి నాలోని సమస్త ప్రాపంచిక బంధములను తొలగించుకొందును. హరి స్మరణమున నిలిచిన నన్ను కలి తాకలేడు. కలి ఏమి? మరణ దేవత కూడ తాకలేదు. ఇక మరణమునకు మరణమే గతి. మృత్యువునకు మృత్యువైన హరి నాయందుండగ మృత్యువామడ దూరమున వుండగలదు. ఇకపై ఈ దేహమున ద్వంద్వములకు తావులేదు. మనసున హరి చైతన్యము పెరుగును గనుక దేహాత్మ భావము సన్నగిల్లును. దేహము వశమై నాకు విడుదలను హరి చైతన్యమే

ఏర్పాటు చేయును. ఇక నాకు పరమార్థమే గమ్యముగాని, అర్థకామములు కావు. దైవ ప్రార్థనము నా ధ్యేయమునకు పట్టుగొమ్మ.

## *ధనకాముని ప్రార్థనము :*

"దేవ దేవుడైన శ్రీహరీ! నీకిదియే నా విన్నపము. నేను నిన్ను శరణుజొచ్చు చున్నాను. అది కారణముగ సమస్త దేవతలు నా కనుకూలు రగుగాక! నేనిక సమస్త రూపములను ఈ నీ రూపముగనే భావించుచు, వారికి సేవ చేసుకొందును. నేనిక నీ శరణాగతుడను. నే చేసిన పాపములను క్షమింపుము. ముసలివాడనని నిర్లక్ష్యము చేయకుము. గతిలేక నీ గతి కోరితినని హేళన చేయకుము. చిట్టచివరి క్షణములలో స్మరించినవారిని కూడ నీవు రక్షించితివి. కావున నన్ను ఉపేక్షింపకుము. ఖట్వాంగు నంతటివాడిని క్షణ కాలమున ఉద్ధరించితివి. అజామీళుని యమదూతల బారినుండి రక్షించితివి. నా జీవనమిక నీ సేవకే అంకితము."

## *సన్యాసము :*

పై విధముగ ధ్యానము చేయుచు లభించిన ఆహారమునకు తృప్తి చెందుచు, పరహితమే పరమ ధర్మముగ ధనకాముడు జీవించ సాగెను. అతని హృదయమున ఆనందముప్పొంగ నారంభించెను. అపుడు ధనకాముడిట్లు చింతించెను. "నా లోపల అకారణముగ ఆనందము కలుగుచున్నది. ఇదివరకటి నా దుఃఖమునకు నేనే కారణము. ధనకాముడనై జీవితమును దుఃఖమయము చేసుకొంటిని.

ఇపుడు కామము నశించగ ఆనందము జనించుచున్నది. ధనముతో పాటు దుఃఖము కూడ పోయినది. పీడ విరగడైనది. నాకిక ఈ ప్రపంచమున దైవ సంబంధమేకాని ప్రాపంచిక సంబంధము లేదు." మనసిట్లు క్రమశః పరిణతి చెందుచుండగ ధనకాముడు భావపరమైన సన్యాసమును పొందెను. ఆకలి దప్పులను మరచెను. అతని మలినములు కరిగెను.

## *ధనకాముని సన్యాసము :*

వివేకముతోను, వైరాగ్యముతోను పరహిత కార్యములను శారీరికముగ చేయుచుండుట చేత ధనకామునికి పుష్కరకాలములో సన్యాసము సిద్ధించెను. అతను నిగర్వి అయ్యెను. తాను తామరాకై సమస్తమును నీటి బిందువుగ దర్శించెను. అతడు నిస్సంగి అయ్యెను. నిజమైన సన్యాసిగ వెలుగొందెను. పండిన పండువలె గోచరించెను.

తోటి సన్యాసులు అగ్నికార్యములు చేయుచు నేతిని, తిలలను హోమ గుండములలో వేయుచు కోపమును, కామమును కాల్చివేసితి మని భ్రమ చెందు చుండగ ధనకాముడు మనోపరమైన హోమము నందు వానిని దహించి వేసెను. అతని మనస్సు పవిత్రమై నిలచి యుండుటచే కామమునకు తావు లేకపోయెను. కోపము, కామము, అహంకారము నశించగ అతడు త్రిదండి సన్యాసి అయ్యెను. హరి అనుగ్రహము బడలి పర్యాటనము మొదలిడెను. అమితానందముతో అతడు పలు ప్రాంతములను పర్యటించెను. దేహాభిమానమును విసర్జించుటచే సంఘ బంధములు వీడెను. ఒంటరిగ సమస్త

ప్రదేశములలోను పర్యటించుచూ, ఆత్మానందమును పొందుచుండెను. పట్టణములయందు నివసించక, వనముల యందు ఏకాంతముగ నివసించసాగెను. భిక్షకు మాత్రము పల్లె, పట్టణములను ప్రవేశించు చుండెను. లభించిన భిక్షతో తృప్తి చెంది జీవించెను. ఒకే చోటికి భిక్షకు ఎప్పుడును వెళ్ళెడివాడు కాదు. ఇన్ని గృహములకు వెళ్ళవలెనని నియమము లేదు. బ్రాహ్మణ గృహములకే వెళ్ళవలెనని నియమము లేదు. అవధూతయై తిరుగాడసాగెను. మరియొక పుష్కరకాలము గడచెను.

## అవంతి ప్రవేశము :

ధనకాముడు దరిద్రుడై, భగవద్భక్తుడై, సన్యాసియై, అవధూతయై పర్యాటనమున తన పూర్వ నివాసమైన అవంతీ మహా నగరమును చేరెను. అతడిపుడు వృద్ధు. ఆచార్యుడు, సన్యాసి మరియు అవధూత. పర్యాటనమున స్వగ్రామము చేరిన ఆచార్యుడు తన గృహమున కొక మారేగుట ధర్మము. అవంతి నగరవాసులు అతనిని గుర్తించిరి. దరిద్రుడైన ధనకాముడు సన్యాసియై తిరిగి వచ్చెనని వదంతి పుట్టెను. కొందరు దుష్టజనులు అతనిని హింసింప మొద లిడిరి. రక రకములుగ అతనిని బాధ పెట్టిరి. అయినను ధనకాముడు చలించలేదు. ఆత్మనియతి కలవాడై సమస్తమును సహించెను. శాంతిని వీడక యుండెను. కోపము రాలేదు. కొందరతనిని ఎప్పుడు సన్యాసి వైతివి ? ఎన్నాళ్ళనుండి సన్యాసిగ నున్నావు ? అని ప్రశ్నించిరి. ధనము పోయినది కదా! గతిలేక సన్యాసి అయినాడు కాబోలు! అని

కొందరనిరి. సన్యాస మిచ్చిన మూర్ఖుడెవరో ? అతడు కూడ దొంగ సన్యాసియై యుండవలెను– అని ధనకాముని నిందించిరి. గుండు చేయించుకున్నంత మాత్రమున సన్యాసి యగునా ! అని నవ్విరి. కపట సన్యాస వేషమున ఎంత ధనము గడించితివి ? ఎచ్చట దాచితివి ? అని ప్రశ్నించిరి. ఇతడవధూత కావున దేహాభిమాన ముండదు– అనుచూ అతనిపై కొందరు రాళ్ళు రువ్విరి. ఇతడు త్రిదండము ధరించినాడు. ఇది కేవలము బూటకమే. కుక్కలను తోలుటకు చేతికర్ర వుండవలెను కదా! అనిరి. దొంగ సన్యాసులను కుక్కలు వెంబడించును. అందుకే చేతికర్ర అని వెక్కిరించిరి. ఇతడు కప్పుకొన్న కంబళి డబ్బుతో నింపబడి లేదుకదా! అనుచు కంబళి లాగుకొనిరి. కొందరు త్రిదండము లాగుకొనిరి. మరికొందరు భిక్షా పాత్రను లాగికొని పారవేసిరి. ఇంకొందరు అతడు ధరించిన తులసిమాలను బెరికిరి. ఇతడు నాకు పూర్వమున ఋణపడి యున్నాడు అనుచు, ధరించిన వస్త్రములను, చివరికి కౌపీనమును కూడ లాగివేసిరి.

ఇన్ని జరుగుచున్నను ధనకాముడు ఒక్కమాటైనను మాట్లాడ లేదు. కోపగించలేదు. హృదయమున వారిని క్షమించుచు మౌనముగ తన పయనమును సాగించెను. అది చూచిన సజ్జనులు దైవ నామ స్మరణము చేయుచు, అతనిని సమీపించి “ప్రజల వలన తప్పులు జరిగినవి, వారిని క్షమింపుడు. వారజ్ఞాను లగుటచే మీ మహాత్మ్యమును గుర్తించలేదు. ఈ వస్త్రములను గైకొని ధరించుడు.” అని పలికి వస్త్రము లిచ్చి పాదములపై పడిరి. అతని త్రిదండమును, భిక్షాపాత్రను అతని

కందించిరి. ఇంతలోనే దుష్టజనులు మరల సమీపించి సమస్తమును లాగుకొని "ఈ దుష్టుని మన్నింపరాదు. ఇతనిని శిక్షించినచో భగవంతుడు మెచ్చును" అనుచు అనేకములైన దుర్భాషలాడిరి.

అవంతీ మహానగరమున, అవధూతయై సంచరించుచున్న ధనకాముని ప్రజలలో నొక తెగవారు కటువుగ బాధించిరి. తిట్టుట నుండి కొట్టుట వరకు కూడ హింస పెరిగెను. అయినను ధనకాముడు మౌనము వీడలేదు. మాటాడలేదు. "ఇతడు పిసినారి, కపటి, అందరిని మోసము చేసిన దుష్టుడు. ఇతనిని ఎట్లైనను మాట్లాడించవలెను" అనుచు రక రకములైన ప్రయత్నములు చేసిరి. "ఇతనికి సిగ్గులేదు. ఇతని కుటుంబమే యితనిని పరిత్యజించెను. ఇతని సన్యాస వేషమున కర్థము లేదు. ఎందరినో మోసగించెను. ఇప్పుడీ మౌనము, వేషము ఏ మోసము కొరకో. ఇతనిని బంధించుడు, కొట్టుడు, నిజము రాబట్టుడు" అనుచు బాధించిరి. మరికొందరు "ఇతడు సాక్షాత్తు అవధూతయే. ఆత్మనియతి కలవాడు, ధీరుడు. మన మేమి చేసినను ఊరకుండుట సామాన్య విషయము కాదు. వీరు హింసించిన కొలది అతనియందు శాంతము, గంభీరత్వము పెరుగుచున్నవి" అని అతనిని రక్షించుకొను చుండిరి.

ధనకాముడు హృదయమున యిట్లు తలంచసాగెను. "తన పాపములకు పరిష్కారములుగనే ఈ దండనము జరుగుచున్నది. **ప్రారబ్ధము అనుభవించవలెను కదా ! రాజుకైనను, పేదకైనను ధర్మమిదియే కదా !** జీవులను హింసించితిని కనుక జీవులచే

హింసింప బడుచున్నాను. హరి స్మరణ మాధారముగ వీరిని భరింతును. బాధించువారిని క్షమింతును. ప్రారబ్ధవశమున వచ్చు దుఃఖములను, కష్టములను దైవస్మరణముచే దాటుట ఒకటియే ఉపాయము. కృష్ణ భక్తులైన పాండవులు, కృష్ణ సాన్నిధ్యమును, వారివారి ప్రారబ్ధములను బట్టి అనుభవించిరి కదా ! హరి హరాదులైనను ప్రారబ్ధమును తప్పింపలేరు. కాని వారి స్మరణమున బాధ తీవ్రత ఉపశమింప బడును. వీరు హింసించినకొలది వీరియందలి హరినే దర్శింతును." అని తలపోసెను. ధనకాముడిట్లు కృతనిశ్చయుడై, ధీరుడై, శాంతము వహించి మౌనముగ నుండెను.

కాలక్రమమున ధనకాముని ప్రవర్తనము అవంతీ ప్రజల హృదయములను కదల్చినది. వారు క్రమశః అతనిని గౌరవించుట మొదలిడిరి. వారు అతనిని గరువుగ నంగీకరించి, ప్రార్థించి, పూజించి, అతని నుండి జ్ఞానము పొందుటకు ఉపక్రమించిరి. వారి భక్తిశ్రద్ధలను గమనించి ధనకాముడు బోధలను చేయసాగెను.

# ౬

# ధనకాముని బోధలు

**సుఖ దుఃఖములకు కారణము :**

సుఖమునకు గాని, దుఃఖమునకు గాని ఎవ్వరును కారణము కాదు. సుఖమందించిన వారిని మంచివారని, దుఃఖమందించిన వారిని చెడ్డవారని భావించుట భ్రాంతి. అది మనసు కారణముగ నేర్పడుచున్నది. మనసు చేయు ఊహలను, కారణములుగ భావించి కొందరిని ప్రేమించుట, కొందరిని ద్వేషించుట అజ్ఞానము. మన సుఖ దుఃఖములకు మనమే కారణము. లోకులు కాదు. లోకులే కారణమని భావించి మరికొన్ని అవివేకపు కార్యములు చేయకుడు. మనస్సే యిట్టి భ్రమను కలిగించును. సుఖమునకు దుఃఖమునకు కర్తలు మీరే. మీరే మీ జీవితమునకు బాధ్యులు. మరియొకరు కాదు.

దేవతలు కూడ మీ సుఖ దుఃఖములకు కారకులు కారు. మీ కర్మల ననుసరించియే వారు ఫలితము లీయగలరు గాని ప్రత్యేకముగ ఏమియు చేయజాలరు. సమస్త దేవతలు మీ మనస్సు

నుండే ఉద్భవించుచున్నారు. మనస్సు చిత్రించిన రూపములలో దేవత లగుపడుట మనసునకు సంబంధించిన విషయమే. మనసును (స్వభావమును) బట్టియే సుఖ దుఃఖము లుండును గాని దేవతా రాధనముల బట్టి కాదు. అన్యదేవతారాధనము నందలి పరిమి తత్త్వమును భగవంతుడు గీత యందు స్పష్టముగ తెలిపినాడు. **ఆత్మనియతితోనే మనసునందలి సుఖదుఃఖములను జయించ వచ్చును. మనసుతో సుఖదుఃఖములను జయించలేరు.** మనసు ద్వంద్వములకు లోబడి యుండును. ఆత్మ ద్వంద్వాతీతము.

లోకులు గాని, దేవతలు గాని మన సుఖదుఃఖములకు కారణము కాదు. కారణం మనమే ! అట్లే కొందరు సుఖ దుఃఖములకు గ్రహములు కారణమని భావించి, గ్రహ పూజలు, గ్రహ శాంతులు చేయజూతురు. ఇదియూ మనోభ్రాంతియే. మన కర్మల ఫలములను మన కందించునవే గ్రహములు. ఇది తెలిసి కర్మలను సరిచేసుకొనవలెనేగాని, గ్రహ పూజలు చేయుట తెలివైన పనికాదు. కర్మ స్వరూప స్వభావములను గోవిందుడు గీతయందు స్పష్ట మొనర్చెను గదా! అది రుచింపని వారు ప్రక్కదోవలను పట్టుదురు. కాని వారి ప్రయత్నములు నిష్ఫలములే.

గ్రహముల నన్నింటిని మించిన గ్రహము మనస్సే ! మనో నిగ్రహము గావించుకొనువారే బంధ మోచనమును పొందగలరు. గ్రహ ప్రభావముకన్న మనో ప్రభావమే దీర్ఘకాలము జీవులను బాధింప గలదు. ఏలినాటి శని ఏడేండ్లు బాధించిన, మనసు

ఏడు జన్మల సైతము బాధించ గలదు. స్వభావము మారనివాడు పనులు చేయు రీతియందు మార్పు కలుగక పోవుట వలన జన్మల తరబడి ఒకే విధమైన సుఖదుఃఖములను పొందుచుందురు. గ్రహ ప్రభావమును దాటవలెనన్నచో మనో ప్రభావమును దాటుటయే ముఖ్యము. మనస్సునందు ద్వంద్వము లున్నంత కాలము సుఖదుఃఖములు వెంటాడుచునే యుండును.

సుఖదుఃఖములకు కొందరు కర్మ కారణమందురు. నిజము నకు కర్మ దివ్యమైనది. కావున అట్టివానికి కర్మ దివ్యానుభూతియే కలిగించును. సుఖదుఃఖములకు కారణము కాజాలదు. కర్మకు కామమును జోడించుట వలన కర్మ సుఖ దుఃఖ కారణ మగుచున్నది.

సుఖ దుఃఖములకు లోకులు కారణము కాదు. దేవత లంతకన్న కాదు. గ్రహములు కారణము కానే కాదు. కర్మ కారణము కాదు– అని తెలిపిన ధనకామ స్వామి, కాలము కూడ ద్వంద్వములకు హేతువు కాదని పలుకుచున్నాడు.

సర్వసంగ పరిత్యాగిని కాలమేమి చేయకలదు? ఆత్మయందు స్థితిగొన్న వానిని కాలము స్పృశింపలేదు. ఆత్మ నుండియే కాలము, శక్తి, ప్రకృతి పుట్టుచున్నవి. కావున ఆత్మ స్వరూపుడైన జీవుని, కాల మంటజాలదు. మనసున జీవించువారినే కాలము బంధించును. వారికే మంచికాలము, చెడ్డకాలము అని యుండును. వారికే పుట్టుట, చచ్చుట, పెరుగుట, ముసలివారగుట యుండును. మనసు కలవారికి యూహలుండును. ఊహలను నిజము చేసుకొందురు. జాతకమును

పరిశీలించి ఒక సంవత్సరము లోపున చత్తునని నిశ్చయించు కొన్నవాడు, చావు నాహ్వానించుకొని చచ్చును. ప్రతి సన్నివేశము నందు మరణమే గుర్తు తెచ్చుకొనుచు మరణించుటకు సిద్ధపడును. పాము కోరలు గ్రుచ్చుకొనుటచే, చత్తునని భావించిన వాడొకడు నిద్రలో సూది గ్రుచ్చుకొనినప్పుడు పాము కరచినదని భావించి చచ్చెను. అతని భయమే అతని మృత్యువయ్యెను. మరియొకనికి వీపున పాము కాటువేయగ, స్నేహితుడొకడు ముల్లు గ్రుచ్చుకొనెనని, ముల్లును తీతును అని పలికి, కాటువేసిన స్థలమున రక్తమును పీల్చెను. అతడు బ్రతికెను. పాముకాటు కన్న పాముకాటుని గూర్చి మనసున కల భావనయే మృత్యు కారణము. మేడపై నుంచి దుమికినచో కాళ్ళు విరుగునని తెలిసిన మనసుకు కాళ్ళు విరుగును. తెలియని పసివానికి ఏమియు విరుగక అందరి నాశ్చర్యపరచును. కావున కారణము, మనసునుబట్టి పనిచేయును. ఆత్మపై ప్రభావము చూపలేదు.

## మనస్సు - దాని స్వరూప స్వభావములు :

సుఖదుఃఖములకు, జనన మరణములకు మనస్సే కారణము. దాని స్వరూప స్వభావములు దాని నధిగమించిన వారికే తెలియగలవు. మనసునకు ఊహించు శక్తి కలదు. అది కారణముగ రకరకములైన భావనలు పుట్టుచుండును. అవి త్రిగుణాత్మకములుగ నుండును. త్రిగుణముల పాళ్ళను బట్టి ప్రపంచమున అనుభూతి కలుగు చుండును. సృష్టియందు మనో నిర్మాణమే లేనిచో మాయలేదు. పంచభూతముల ఇంద్రజాలము లేదు. నిద్ర సమయమున మనస్సు

లేదు. కావున జీవునకు ప్రపంచము లేదు. నిద్ర అజ్ఞానమునకు ప్రతీక. పూర్ణజ్ఞాని, పూర్ణ అజ్ఞాని మనసు లేకపోవుటచే ద్వంద్వములకు లోనుకాడు. పిచ్చివానిని చూచి “పాపము పిచ్చివాడు” అని మనసుగల వాడనుకొనును. పిచ్చివానికి తాను పిచ్చివాడనని తెలియదు కదా! అందుచే ఒక విధముగ పిచ్చివా డదృష్టవంతుడే. జ్ఞానులు కూడ పిచ్చివారి వలె గోచరింతురు. వీరిరువురును త్రిగుణముల కతీతులే. కాని ఒకరు స్వాధీనము కలవారు, మరియొకరు పరాధీనులు.

త్రిగుణముల యందలి సామ్యమును పొంది ఆత్మవంతుడు త్రిగుణాతీతుడుగ జీవించును. ఆత్మవంతుడైన వాడు త్రిగుణముల ద్వారా ప్రతిబింబించును కాని త్రిగుణముల ద్వారమున ప్రవేశింపడు. నీటియందు కనపడు సూర్యబింబము, చంద్రబింబము నీటియందు లేవు కదా ! అవి ప్రతిబింబములే. ఆకసముననే యున్నవి. దిగి రాలేదు. అట్లే ఆత్మవంతుడును. త్రిగుణములలోనికి ప్రతిబింబించి మనసు, శరీర మాధారముగ ప్రవర్తించుచున్నను, అతడు త్రిగుణముల కతీతముగనే యుండును. కావున మనస్సునకు పుట్టుక స్థానము, ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులే. అవి ప్రకృతి శక్తులు. ప్రకృతి మార్పు చెందునది. ఆత్మకు మార్పులు లేవు. ప్రకృతియందు ప్రతిబింబించినను అచలమే. ప్రకృతి శక్తుల నాధారముగా గొని మనసు పుట్టును.

### *త్రిగుణములు - మనసు :*

ప్రకృతియొక్క త్రిగుణముల నుండి మనస్సు పుట్టును. ప్రకృతి ఆత్మ వలన చైతన్యము పొందును. ఆత్మ సహకరించనపుడు

ప్రకృతి జడమే! దానియందు శక్తు లుద్భవించవు. మనసు కూడ ప్రకృతి నుండి పుట్టినది కనుక అదియును జడమే. ఆత్మ సహకరించి నప్పుడే త్రిగుణముల కదలిక ఏర్పడును. త్రిగుణముల కదలిక కారణముగ మనసున భావము లుద్భవించును. కావున తనయందు తాను స్థితి గొనిన సంకల్పమే లేదు. సంకల్పము లేనిచోట మనసు లేదు.

పై కారణముగ ఆత్మ యొక్కటియే మనస్సునకు స్వామి. కాని ఇంతటి స్పష్టమైన విషయము, సత్వగుణము కలవారియందే భాసించును. రజోగుణ ప్రవృత్తి కలవారియందు భాసించదు. ఆహారము, నిద్ర, మైథునము ప్రధానముగ జీవించు తమోగుణులకు భాసించదు. ఇట్టి వారికి మనసు మిథ్య అని తెలిపినను ఉపయోగము లేదు. గుణ సంగముచే, మనో సంగ మేర్పడుచున్నది. మనో సంగముచే వ్యక్తిగత కర్మలు, అనుభవములు ఏర్పడుచున్నవి. సుఖ దుఃఖము లేర్పడుచున్నవి. కావున మనస్సు హరింపబడుటకు అసంగ మొక్కటియే మార్గము. ఇదియే పురుషోత్తమ ప్రాప్తి యోగముగ భగవానుడు బోధించి యున్నాడు. సంకల్పములను సన్యసించుట అభ్యాసము చేయువానికి అసంగ మార్గము లభించును. సంకల్పముల యందు జీవించువారు మనసు యందు జీవించుటచే వారికి సంగము వున్నది. సృష్టి యున్నది. ద్వంద్వము లున్నవి. మాయ యున్నది. కనుకనే భగవానుడు అసంగమునే అస్త్రముగ చేసుకొని, సంకల్పము లను త్యజించి, కామమును విసర్జించి, ఫలములు కోరక జీవించుటను యోగ శాస్త్రముగ బోధించెను. మనోహరణమే సమస్తమునకు

పరిష్కారము. మనోహరణమగుచోట మనోహరమగు ఆత్మానుభూతి లభించును.

రాజు సన్నిహితముగ మంత్రితో కలసి మంత్రాంగమును నిర్వర్తించుచూ క్రమముగ మంత్రికి వశుడగును. మంత్రి మంత్రాంగము నందించినను రాజు స్వబుద్ధితో తనదైన నిర్ణయమును చేయుచుండవలెను. జీవుడు రాజు, మనసు మంత్రి. మనసుతో పని చేయించుటయేకాని మనసునకు లొంగరాదు. లొంగినచో మనసందించు ద్వంద్వముల ననుభవించును. ప్రాపంచిక విషయ మున మునుగును. కావున మనోభావములను పరిశీలించుచు స్వభావము నుండి బయల్పడుట ఒక్కటియే బుద్ధిమంతుని కర్తవ్యము. మనసును నియమించ గలవాడు, వినియోగించ కలవాడు, అధిష్ఠించి జీవించువాడు, సమస్తమును సాక్షీభూతుడుగ గమనించుచు దైవ విభూతిని అనుభవించును.

జీవుడు మనస్సును అధిష్ఠింపనిచో మనస్సు జీవుని అధిష్ఠించును. ఇది యొక ప్రమాదము. ఈ విషయమున అప్రమత్తతతో నుండవలయును. ఆత్మబలముతో మనసు నధిష్ఠించి యుండనిచో క్షణకాలమున మనస్సు ఆత్మను భ్రమింప చేయగలదు. ఇది ప్రకృతి యొక్క వశీకరణ శక్తి.

ఎప్పటికప్పుడు మనస్సు తన ఆధిపత్యమునకు ప్రయత్నించు చునే యుండును. సాధు జీవులను కూడ భ్రమింప చేయగలదు. 'నేనొక మంచి సాధువును' అను భావన కలిగించి భ్రమింపచేయును.

'నేను ధర్మపరాయణుడను' అని బోల్తా కొట్టించును. ఇట్లు భక్తులు, వేదము లెరిగినవారు, లోకహితులు కూడ మనసుచే మోసగింప బడుచుందురు. తనను గూర్చిన భావన ప్రశంసాపరముగ కల్పించి, సానుభూతి నేర్పరచి జీవుని కబళించుట మనసు చేయు ఇంద్ర జాలము. **తమను గూర్చి భావించుకొను వారందరూ మనసుకు బానిసలే.** దైవమును భావించుచు, దైవమునే దర్శించుచు, దైవము నందుండుటచే **తమను తాము మరచినవారిని, మనసేమియు చేయదు.** గుర్తుంచుకొనుడు. **మనో పరిశీలనమును అనునిత్యము చేయుడు.**

## *మనోడాంబికము :*

మనసును వినయవంతము చేయనిచో అహంకారియై ఆత్మ తత్త్వమును, దాని వెలుగును హరించును. తానే సర్వమని గర్వపడును. మనసుకు మించిన బలము లేదని అజ్ఞానమున పడును. తాము చేయు కార్యము లన్నియు అద్భుతమైన వనియు, ఇతరులు గుర్తించుట లేదనియు భ్రమ చెందును. తనను గూర్చి తానే గర్వపడుట, స్తుతించుకొనుట చేయును. తానన్నీ సరిగ తప్పు లేక చేయుచున్నానని భావించును. కేవలము తన కర్తవ్యములను తాను నిర్వర్తించుటతోనే మహత్కార్యములు చేసినట్లు భావించును. కుటుంబ పోషణము, సంఘ జీవనము, పశుపక్ష్యాదుల యందు దయ, పెద్దలయందు గౌరవము, దైవారాధనము, శుచిగా నుండుట మానవ కర్తవ్యములు. కనీస ధర్మములు. ఇవి నిర్వర్తించనివాడు పశుతుల్యుడు. నిర్వర్తించిన వాడు గర్వపడుట కేమియును లేదు. విశేష కర్తవ్యముల నాచరించి

నపుడు కూడ సంస్కారవంతులు గర్వపడరు. సామాన్య కర్తవ్యముల నాచరించి గర్వపడుట డాంబికుని లక్షణము. డాంబికత్వము మనసు కలుగచేయు భ్రాంతి. సంద్గ్రంథ పఠనము, సత్పురుష దర్శనము, సద్గుణ ఆరాధనము, సేవ అలవాటు కాని మనసు వినయవంతము కాజాలదు. అట్టి మనసు మనిషిని చిక్కులు పెట్టగలదు.

డాంబిక మనసు తనకు తానే సాధువుగా భావించును. వేదములు, శాస్త్రములు ఒకింత పరిచయము కాగానే పండితుడని గర్వించును. చేత తక్కువ మాట ఎక్కువగ నుండును. ఇతరుల అభిప్రాయముల మేరకు జీవించుటయే కాని కర్తవ్య నిర్వహణ ముండదు. నలుగురూ తనను పొగడు పనులు చేయుట, కనీస కర్తవ్యములను మరచుటగ నుండును.

డాంబికుని సకల కార్యములు నిష్ప్రయోజనములు. అతని దాన ధర్మాది కార్యక్రమములు కూడ సమర్పణబుద్ధి లేకుండుటచే ఫలవంతములు కాజాలవు. ఒక్క మాటలో చెప్పవలెనన్న డాంబికుని యోగాభ్యాసము, శాస్త్రాధ్యయనము, సంఘసేవ, కల్మషరహితము కావు. కావున హృదయము పరిశుద్ధి చెందదు. అట్టి జీవనము పరిశుద్ధ జీవనము కానేరదు. మర్మములేని మనసు, నిర్మల హృదయము, పరిశుద్ధ జీవనమునకు రెండు రెక్కలవంటివి. రెక్కల బలమే పక్షి మనుగడ కాధారము. అటులనే జీవుని పురోగతికి మర్మములేని మనసు, నిర్మల హృదయము ఆధారము.

పై విషయములను మనస్సున అంగీకరించి జీవితమును పునఃప్రారంభము చేసుకొనుట ఉత్తమము. లేనిచో దుస్తరమైన జనన

మరణ బంధముల జీవుడు పతనము చెందును. కావున డాంబికము వదలి సత్యము నాశ్రయింపుడు అని ధనకాముడు శ్రోతలకు బోధించెను.

## *నామస్మరణ - తరణోపాయము :*

మనసునకు వినయము ఏర్పడుటకు ఋషులందించిన ఉపాయము హరి నామస్మరణము. 'హరి' అని గాని 'హర' అని గాని నిత్యము స్మరించు మనసు నందలి సర్వదోషములు ఈ శబ్దము లచే హరింపబడును. 'హరు' డనగా అజ్ఞానమునంతను హరించు వాడు. నశించని శాశ్వతమైన ఆత్మజ్ఞానమును అజ్ఞానము ఆవరించి యుండును. అట్టి అజ్ఞానమును హరింపగా జీవుడు శుద్ధ స్ఫటికము వలె ప్రకాశించును. కల్మషరహితు డగును.

'హరి' అనగా అంతర్యామియైన భగవంతుడు నామ రూపాత్మక మైన సృష్టియందు దిగివచ్చుట. పరిపూర్ణమైన ఆత్మ తత్త్వము హరతత్త్వమైనచో అది దిగివచ్చినపుడు హరి అగును. దిగివచ్చినచో హరి, దిగిరానిచో హరుడు. హరి తేజము హరుడే. హరుని మనోహర రూపము హరి.

కావున హరిహర శబ్దములను సదా మనసున భావించు జీవునియందు కల్మషము లన్నియు హరింపబడగలవు. మనసు యొక్క సమస్త పాతకములను హరించు శక్తి దేవనామమునకు కలదు. అట్టి శక్తిగల శబ్దముల కూర్పు దైవ నామముగ ఋషులు దర్శించి అందించిరి. 'నారాయణ–వాసుదేవ–హరి–గోవింద–రామ–కృష్ణ' శబ్దము లట్టివే. 'నమః శివాయ– శంభో సదాశివ–హరహర మహాదేవ'

అను శబ్దములు కూడ నట్టివే. కేశవాది చతుర్వింశతి (ఇరువది నాలుగు) నామములు కూడ అట్టివే. ఈ విషయమున భారతీయులు అదృష్టవంతులు. ఋషులు మానవజాతిపై గల అపార కరుణ కారణముగ రకరకముల సూక్తములు, స్తోత్రములు దైవనామములతో కూర్చి, పేర్చి అందించిరి. ప్రతిదినము కనీసము ఒక గంట సమయము మనసు లగ్నము చేసి పఠించినచో మనసునందలి దురితము లన్నియు క్రమశః తొలగిపోవును.

*"కలౌ నాశ్త్యేవ గతిరన్యథా*
*హరేర్నామ ఏవ కేవలం ॥"*

కలియుగమందు కేవలము దైవనామము తప్ప మనిషికి మరియొక గతి లేదు. కలి కల్మషము మానవుని మనసును ఈ కాలమున ఏ క్షణమైనను తాకవచ్చును. అట్టి కల్మషము తాకకుండు టకై కవచముగ దైవనామము నుచ్చరించుట ఉత్తమము. దైవనామము నుచ్చరించిన వారికి లోపల బయట కూడ పరిశుద్ధి ఏర్పడగలదు. కలి ప్రభావము నుండి రక్షించుకొనుటకు కలికల్మష హరుడైన శ్రీకృష్ణ దేవుడు సతత నామస్మరణ మార్గమును ఉద్ధవుని ద్వారా అందించెను. అట్టి నామమును శ్వాసయందు నిలిపి, శ్వాసవలెనే నిరంతరము స్మరించుట జీవునికి సులభమగు తరణోపాయము.

రెండక్షరముల దైవనామము ఉచ్ఛ్వాస నిశ్వాసలతో సంధింప వచ్చును. అట్లు సంధించి ధ్యానించినచో శ్వాసవలె నామ స్మరణము కూడ నిరంతర గానముగ సాగును. అట్టి గానము కారణముగ

శ్వాస 'హంసగానము' కాగలదు. జీవుడు క్రమశః తన హంస శ్వాసరూపమును గ్రహించి సకల బంధముల నుండి విమోచనము పొందగలడు. ఇట్టి నామస్మరణ విధానమున కరగినట్లుగ దంబముతో కూడిన మనసు మరి ఏ విధానమునను కరుగదు. డంబము కరిగి వినయము పెరిగి పవిత్రతను పొంది మనసు సులభముగ తనకు (జీవునకు) లోబడును. ఇదియే తరణోపాయము.

**ముఖ్య సాధన :**

మానవునకు తన నిజస్థితి తెలియవలె నన్నచో మనసు నిశ్చలము కావలెను. మనస్సు చంచలమై వుండుటవలన మానవుడు నిజస్థితి తెలియక అజ్ఞానమున పడుచున్నాడు. నిశ్చలమైన మనస్సునే మనస్సులేని స్థితిగా తెలుపుదురు. దీనినే మనసును జయించుటగా కూడ తెలుపుదురు. మనస్సు నిశ్చలమైనపుడు స్పష్టముగను, పారదర్శకముగను నుండును. అట్లుండుటచే లేనట్లు గోచరించును. గాజుకిటికీ యొక్క గాజును పరిశుభ్రముగ తుడిచినచో గాజు ఉన్నను లేనట్లుండును. గాజునకు ఆవలి దృశ్యములు స్పష్టముగ గోచరించును. అందులకే అత్యంత పరిశుభ్రముగా నున్న గాజుపై కొన్ని బొమ్మల నతికించి అక్కడ గాజు ఉన్నట్లుగా సూచింతురు. పక్షులు కూడ ఈ బొమ్మల సంకేతముల కారణముగనే గాజు కిటికీకి ఢీ కొట్టుట నుండి రక్షించుకొను చున్నవి.

*మరియొక ఉదాహరణ :* ఒక పరిశుభ్రమైన లోటాలో పరిశుభ్రమైన నీరు పోసి చూసినచో చూచువానికి లోటా మట్టమే కనిపించును గాని నీటి ఉపరితలము కనిపించదు. నీటి ఉపరితలము

వున్నట్లు నీటిని కదిలించినపుడు మాత్రమే తెలియును. కదలిక లేని స్పష్టమగు నీరు పారదర్శకముగ లోపలి వస్తువులను చూపించును. పరిశుభ్రమైన గాజు తెర అట్లే ఆవలి విషయములను గోచరింప జేయును. మనసుకూడ పరిశుభ్రమై నిశ్చలమైనచో తానుండక బుద్ధి ప్రకాశించుచు నుండును. బుద్ధి జీవుని వెలుగే. జీవుడు దేవుని వ్యక్త రూపమే. ఇట్లు వెలుగొందు జీవునకు మనస్సు యొక్క అవరోధము లేకుండుటచే దివ్య వైభవమే సృష్టియందు గోచరించును. మనస్సు దట్టముగ అవరోధ మేర్పరచునపుడు కేవలము పాంచభౌతికమైన సృష్టి మాత్రమే గోచరించును.

కావున సమస్త సాధన మనో నిశ్చలత కొరకే అని తెలియ వలెను. మనస్సు జయింపబడినపుడు చైతన్యమే నిశ్చలమైన మనస్సు ద్వారా పనిచేయును.

## *దేవుడు - జీవుడు - మనస్సు :*

చైతన్యమే మనస్సునకు పుట్టుక స్థానము. తెలివి చైతన్యమునకు మరో పేరు. దీనిని బుద్ధి ఎఱుక అని కూడ అందురు. బుద్ధికి పుట్టుక స్థానము జీవుడే. జీవునికి పుట్టుక స్థానము దేవుడు. కాన దేవుని నుండి జీవుడు, జీవుని నుండి జీవుని బుద్ధి, జీవుని బుద్ధి జీవుని మనస్సు పై ప్రతిబింబించును. దైవము నుండి పుట్టిన చైతన్యము నుండి జీవులు పుట్టగా, జీవుల నుండి మరల చైతన్యము ప్రసరించి జీవుని బుద్ధిగా వెలుగొందు చున్నది. అటులనే దైవము

నుండి మనస్సు పుట్టగా, అది జీవుల యందు జీవుని మనస్సుగా ఏర్పడుచున్నది. అటులనే దైవము నుండి పశుపక్ష్యాదులు, వృక్షములతో కూడిన పంచభూతాత్మకమైన సృష్టి పుట్టగా జీవునకు ఇంద్రియములు, శరీరముగా అవి ఏర్పడుచున్నవి. దైవము నుండి వివిధములైన దేవతా శక్తులు పుట్టగా అవి యన్నియు జీవుని యందు దేవతా ప్రజ్ఞలుగా పనిచేయుచుండును. చూచుట, వినుట, మాటాడుట, తినుట, అవగాహన చేసుకొనుట ప్రాణమును పీల్చి అపానమును వదలుట, ఆహారమును పచనము గావించుట– ఇవి యన్నియు మానవునందలి దేవతా శక్తులే.

దైవము తన మనస్సుతో సృష్టిని నిర్వహించగ జీవుడు తన మనస్సుతో తన సృష్టిని నిర్వహింపజూచును. దైవము మనస్సే మనువు. జీవుని మనస్సు మన్వాంశ. జీవుని మనస్సు దైవము మనస్సుతో ఏకీభవించి పనిచేసిన జీవునికి బంధము లేర్పడవు. స్వంత బుద్ధితో అతిక్రమించి పనిచేసిన చిక్కులు పడును. దైవము మనస్సయిన మనువు ధర్మము ననుసరించుచు సృష్టి పరిపాలనము చేయును. మానవుని మనస్సు కూడ ధర్మము నవగాహన చేసుకొని అనుసరించినచో రాజై మనగలడు. కావున మనస్సు పరిశుద్ధముగను, **పారదర్శకముగను వుండవలెనన్నచో ధర్మాచరణము ఏకైక సూత్రము.** మనస్సు అట్టి ధర్మాచరణాసక్తి కలిగియుండవలె నన్నచో దైవా రాధనము, దివ్యనామస్మరణము జరుగవలయును. మనసును జీవుని ప్రయోజనమునకై మలచుటకు ఇదియొక పరిష్కారము (ఉపాయము). అట్లు జరిగిన నాడు మానవుడు మహనీయుడు కాగలడు.

## మనస్సు - సిద్ధాంతములు :

మనస్సు పుట్టుక స్థానము బుద్ధి. పుట్టుక స్థానమునుండి విడివడిన మనస్సు భ్రమ చెందును. భ్రాంతిని గొనును. మోహమున బడును. వివేకమును కోల్పోవును. అట్టి సమయమున సదవగాహనకు అవకాశము లేకుండును. బుద్ధితో కూడని మనసు జీవుని అహంకారిగా మార్చును. అట్టి మనస్సుచేత జీవుడు సత్కార్యము నొనర్చినను సత్ఫలితము లుండవు.

దీర్ఘకాలము సత్కార్యము లొనర్చుచు కూడ భావ బంధములను దాటనివారు వేలకు వేలు గలరు. వీరందరును వారివారి భావనలచే బంధింపబడినవారే. తాము నమ్మిన భావములే తమకు సత్యమని భ్రమపడి వారి భావములను వారు సిద్ధాంతీకరింతురు. వారి సిద్ధాంతములలో అవివేకులు, ఆలోచనా రహితులు, ఆవేశపరులు సమిధలుగ బలిచేయ బడుదురు. తాముగూడ తమ సిద్ధాంతములకు బలియగుదురు. తమనుండి పుట్టిన భావములు తీవ్రరూపము దాల్చి, సిద్ధాంతములై తమనే బలిగొను చున్నవని తెలియని మోహితాత్ములుగ మానవజాతిలో పెక్కుమందిని దర్శించవచ్చును.

ఇట్లు భావ బంధములచే పీడితులగువారు చేయు దానధర్మాది కార్యక్రమములు కూడ వారివారి సిద్ధాంతములను, భావములను బలపరచుకొనుటకే కావున, వారిని సుఖము ఎండమావుల వలె మోసము చేయుచుండును. ఇట్టి కార్యక్రమములన్నియు అహంకారము యొక్క వికృత విన్యాసమే. వీరి జీవితములు వరద గోదావరివలె

సాగును. వరద నీటియందు బురద అమితమగుటచే దప్పిక తీర్చుకొనుటకు వీలుపడదు. వరద సామాన్యముగ పంటనష్టము, ప్రాణనష్టమును గావించును. అట్లే సిద్ధాంతవాదు లందరూ కూడ జీవితమను పొలమున జీవమును నష్టము గావించుకొను చుందురు.

బుద్ధిని వీడిన మనస్సు ఇట్లు వికృతమై దైవము, ధర్మమును గూర్చి కూడ సిద్ధాంతముల నేర్పరచుచుండును. బుద్ధితో కూడిన మనస్సునకు సిద్ధాంతముల పేలవత్వము స్పష్టముగ గోచరించును. అట్టి మనసు సిద్ధాంతములకు లోబడక సత్యము నాశ్రయించి నిర్మమము, నిర్మలము అయి సత్యమును ప్రకాశింపజేయును.

## *సత్త్వగుణ ప్రాముఖ్యము :*

సత్త్వము నాశ్రయించిన మనసు సత్యప్రకాశమునకు వాహికగ నుండునే కాని తనకై తానుగ ఏమియు చేయదు. సత్త్వగుణము నాశ్రయించినపుడే మనసునకు 'చేయుట' అను భ్రాంతి తొలగును. అట్టి భ్రాంతి తొలగిన మనస్సునకు 'జరుగుట' గోచరించును. సమస్తము కాలము ననుసరించి వచ్చుచు పోవుచున్నవని, కాల ప్రవాహమున కోట్లాది సంఘటనలు వచ్చి పోవుచున్నవనియు, తానందు కేవలమొక పాత్రధారి యనియు, తన నుండి కూడ తగుమాత్రము పాత్రపోషణము జరుగుచున్నదనియు తెలిసి మొదట ఆశ్చర్యము చెందును. అటుపై తన నుండి జరుగు కర్తవ్యములను గూడ తాను సాక్షిగ చూచుచుండును. భగవంతుని యొక్క సర్వసాక్షిత్వ మేమియో తెలియును.

సత్సాధకునకు సత్త్వగుణ సమాశ్రయమే ఉత్తమ సాధనము. సత్త్వగుణమునకు దోహదము చేయని కార్యము లన్నియు సాధకునకు వర్జ్యములే. సత్త్వగుణ మలవడుటకు 1. జీవుల సేవ దైవమునకు సమర్పణగా సాగవలెను. 2. దానబుద్ధి కలిగి యుండవలెను. 3. దొంగబుద్ధి లేకుండవలెను. 4. అత్యాశను విసర్జించవలెను. 5. కోరికలకన్న కర్తవ్యమే ప్రధానము కావలెను. 6. మహాత్ముల బోధనలను వినవలెను, చదువవలెను. అందలి ఆచరణీయమైన విషయములను క్రమశః ఆచరణలోనికి కొనిరావలెను. 7. ఎల్లపుడును జీవకారుణ్యము కలిగి యుండవలెను. 8. ఎట్టి పరిస్థితులలోను ఇతరుల కపకారము చేయు బుద్ధిని విసర్జించవలెను. 9. ప్రవర్తనము నందు మృదుత్వముండవలెను. 10. ఓర్పు కలిగి యుండవలెను. 11. శరీరము, మనస్సు శుచిగ నుండవలెను. 12. వాఙ్నియమము కలిగి యుండవలెను. 13. తనను గూర్చిన అభిప్రాయములకై కాలమును వృథా చేయరాదు. 14. నిద్ర, ఆహారము, విశ్రాంతి తగుమాత్రముగ ఏర్పరచుకొని చురుకుదనముతో కర్తవ్యములను, పరహిత కార్యములను నిర్వర్తించు చుండవలెను.

డంబము, దర్పము, మోటుతనము, మోసము, కోపము కలుగుచున్నచో సత్త్వగుణారాధనము జరుగుట లేదని తెలియవలెను. సదాచారమునందు విముఖత కలుగుచున్నచో సాధన కుంటుపడి మనసున వికారములు విజృంభించు చున్నవని తెలియవలెను. భ్రాంతి దర్శనమునకు లోనై, మోహితులై అపరిశుద్ధములైన వ్రతాచరణలు చేయుచు సత్యదూరుడు సత్త్వగుణదూరుడు అగును. ఇవి హెచ్చరికలు.

## అల్పబుద్ధులు :

సత్యమనగా 'ఉన్నది' అని అర్థము. ఉన్నది సత్యము. దీనినే వేదము నందు బ్రహ్మము అనికూడ అందురు. ఉన్నది బ్రహ్మము లేక సత్యము. దానినుండి వ్యక్తమగునది వెలుగు, కాలము, శక్తి. వెలుగుకు మరో పేరే చైతన్యము. ఈ చైతన్యము త్రిగుణములుగ విభజింపబడును. ప్రకృతిగా ఏర్పడును. శక్తి, కాలము సహకరింపగ సత్యము నాధారము చేసుకొని ప్రకృతి సృష్టి అల్లిక చేయును. కావున సృష్టిలోని సమస్తమునకు సత్యమే ఆధారము. సత్యమాధారముగనే కాలము, శక్తి, ప్రకృతి అస్తిత్వము కలిగియుండును. జీవుల అస్తిత్వము కూడ సత్యమే. ఈ సత్యమును తెలియుటయే జ్ఞానమందురు. అట్లు తెలిసినవారు సమస్తమునందలి సత్యమును దర్శించుచూ సమభావన కలిగియుందురు.

ముందు తెలిపినట్లుగా ధర్మము, కర్మము, శుచి, ఆచారము లేనివారికి సత్యజ్ఞానముండదు. వారికి, జగత్తు సృష్టి సత్యముపై ఆధారపడినది అను నమ్మకము కూడ ఉండదు. సృష్టికి ఈశ్వరుడగు భగవంతుడు కూడ లేడనిపించును. సృష్టికి ఒక కారణము లేదని పించును. ధర్మములు సంఘమున కట్టుబాటు చేయుటకు కొందరు ఏర్పరచినవే గాని ప్రకృతి యందవి లేవనిపించును. అశుభ వాసనలు బలపడి అసుర స్వభావము జీవుల నాశ్రయించును. అపుడు వారు ఉగ్రకర్మల నాచరింతురు. జీవుల వినాశమునకు కారణ మగుదురు. చివరకు నశింతురు.

అసుర భావము బాగా మదించగ తమయందు "నేను" అను ప్రజ్ఞ వున్నదని కూడ అంగీకరింపరు. కేవలము దేహము, ఇంద్రియము, మనస్సు, తాముగ భావన చేయుచూ అట్టి దేహేంద్రియ మనస్సును నడిపించుచున్న ప్రజ్ఞను నిరాకరింతురు. ఇట్టి వారిని అల్పబుద్ధు లందురు. వీరికి మితిలేని కామము, మదము, అభిమానము, దంభము యుండును. అపరిశుద్ధములైన సిద్ధాంతములు కలిగి అనాచారముగ వ్రతములు, హోమములు, అభిషేకములు, యజ్ఞములు ఆచరించుచూ శీలసంపద యందు విశ్వాసము లేక జీవింతురు.

## అవిద్య :

సత్త్వగుణమును ఆశ్రయింపక పోవుట వలన అసురభావము లేర్పడుట, అల్పబుద్ధులగుట ఎట్లు జరుగునో వివరించిన ధనకాముడు అల్పబుద్ధుల ప్రవర్తనమును మరింత వివరించుచున్నాడు.

1. వీరికి ఆచరణముకన్న ఆలోచన ఎక్కువగ నుండును.
2. కోరికలపై విశ్వాస మెక్కువుండును.
3. కోరికలను తీర్చుకొనుటకు అన్యాయమగు మార్గములలో ప్రవర్తింతురు.
4. సంపత్తిని కూడపెట్టుటలో జీవితమును నిమగ్నము చేయుదురు.
5. ఇంద్రియ సుఖమే పరమావధిగ జీవింతురు.
6. పొందినవి అనుభవింపక ఇంకను పొందవలసిన విషయముల యందు రమించుచుందురు.

7. వ్యక్తులను గూర్చి, సంఘటనలను గూర్చి తీవ్రమైన అభిప్రాయములు కలిగియుందురు.

8. వీరికి అపోహ లెక్కువ. భావములన్నియు అపోహ చుట్టును అల్లుకొని యుండును.

9. శరీరము అశుచిగా నుండును.

10. వీరు తమను తామే గౌరవించుకొందురు. తమను తాము పొగుడుకొనుట, సన్మానములు చేయించుకొనుట, పేరు ప్రతిష్ఠలకై దంభముగ క్రతువుల నాచరించుట, పదిమంది చూచుచుండగ బాహాటముగ దాన ధర్మాదులు చేయుట చేయుదురు.

11. వీరి స్వభావమున అసూయ అపరిమితముగ నుండును. వీరు భ్రాంతి మోహములకు బానిసలై జీవింతురు.

12. ఇట్టి అసుర స్వభావము కలిగినవారు కామము, క్రోధము, లోభము అను ద్వారములగుండ మరల మరల నరకమునకు దారి తీయుదురు. దాటలేని అశుభ వాసనలచే అనేక జన్మలు "నేను" అను ప్రజ్ఞను మరిచి పుట్టుచు చచ్చుచుందురు.

ఇట్టి స్థితినుండి ఉద్ధరింపబడుటకు సత్త్వగుణ సమాశ్రయమే ఉపాయము. కాలగతిని జీవునకు అట్టి సత్త్వగుణము నందు రుచి ఏర్పడగలదు.

## శమము - మనో విజయము :

సత్త్వగుణము యొక్క విశిష్టతను రజస్తమోగుణముల యొక్క అపాయమును వివరముగ తెలిపిన ధనకాముడు శ్రోతల నుద్దేశించి ఇట్లనుచున్నాడు.

సత్త్వము రజస్సు తమస్సు ప్రకృతి గుణములు. కావున దివ్యము. తమోగుణము రజోగుణమునకు గూడ సృష్టియందు తమవంతు దివ్యకర్మ యున్నది. తమస్సు లేనిచో జీవునికి విశ్రాంతి, నిద్ర యుండదు. రజస్సు లేనిచో మెలకువ, సంకల్పము ఉండదు. కావున తమస్సు రజస్సు కూడ జీవుని కావశ్యకములే. కాని ఇవి రెండును సత్త్వమునకు లోబడి యుండవలెను. సత్త్వ మధిష్ఠించిన స్వభావము కలవాడై, రజస్సు తమస్సులను పరిపాలించువాడై యుండవలెను. తమస్సు నధిష్ఠించి రజస్సుండగ, రజస్సు నధిష్ఠంచి సత్త్వముండవలెను. సమస్త ఆత్మసాధన ఈ సూత్రము ననుసరించి నడుపవలెను. అపుడే స్థిరము - సుఖము అయిన మనసు ఏర్పడ గలదు. ఇట్లు సాధన కొనసాగగా సత్త్వము నిత్య సత్త్వముగ మారును. అపుడే మనసు బుద్ధియందు స్థితిగొనును. అదియే జీవునకు సూర్యోదయము. అపుడు మనసునకు గల భావములు, పట్లు, అభిప్రాయములు ఒక్కమారుగ అదృశ్యమగును. సూర్యుడు తూర్పున ఉదయించిన సందర్భమున లక్షలాది దీపములన్నియు వెలవెల పోయినట్లు బుద్ధి ప్రచోదనమైన జీవునికి లక్షలాది మనో భావములు అదృశ్యమై బుద్ధి మార్గమున సమస్త కార్యములు నిర్వర్తింపబడగలవు.

మనో ప్రయత్నమను మెరమెర కూడ నశించును. కార్యములు అప్రయత్నముగ సిద్ధించును. (కార్యములు తన నుండి జరుగు చున్నప్పటికి తాను చేయుచున్నానని భావన లేకుండటయే.) ఇట్టి స్థితి చేరిన జీవుడు శమమును పొందును. శమమును పొందిన జీవుని యందు తర్కముండదు. ఆనందముండును. అన్ని సన్ని వేశముల యందు తర్కముండదు. ఆనందముండును. అన్ని సన్నివేశములయందు అనుభూతి యుండును. ఇంద్రియార్థముల యందు ప్రత్యేకమైన ఆకర్షణ వుండదు. ఏనుగు నడచివచ్చు దారిన కుక్కలకు తావులేదు. గజ దర్శనముతో కుక్కలు పరువెత్తినట్లు బుద్ధి ప్రచోదనమైన మనస్సును ఇంద్రియ వ్యాపారము సోకలేదు. దరిదాపులకు కూడ చేరలేదు.

"నే నిట్లే శమము చెందితిని. ధనతృష్ణ నుండి బయల్పడితిని. అది కారణముగనే మీ యందరి ఆదరణకు పాత్రుడనైతిని" అని ధనకాముడు చిఱునవ్వు నవ్వెను.

## ***కర్త, భర్త, భోక్త :***

నీ జీవనమునకు సుఖము, దుఃఖము నీవలననే కలుగు చున్నవి. తినుచున్నప్పుడు నీవు నాలుకను కొఱుకుట జరుగును. దానికెవరు కారణము? నాలుకను పెరికివేయలేవు కదా! పండ్లను ఊడపీకలేవు కదా! నీకు బాధ కలిగించిన పలు వరుస కాని, బాధ నందించిన నాలుకను కాని నీవు శిక్షించవు కదా! కారణమేమి? అవి నీలోని భాగములని తెలియుటయే. కాని అట్టి బాధ ఇంకొకరి

వలన కలిగినట్లయినచో వారిపై కోపగింతువు. వారిని ద్వేషింతువు. పగ పట్టుదువు కూడ. కారణమేమి? అతడు నీలోని భాగము కాదను భావనయే.

నీకుగ నీవు జారిపడినపుడు, తత్కారణముగ దెబ్బలు తగులుటగాని, ఎముకలు విరుగుటగాని జరిగినపుడు నిన్ను నీవు సానుభూతితో బుజ్జగించుకుందువు. కాని నిన్నట్లెవరైనా పడదోసినచో పగ పూనెదవు. ఇది ఏమి వింత?

నీ బాధలకు గాని, నష్టములకు గాని, నీ సంతోషమునకు గాని, లాభమునకు గాని, నీవే కారణమని తెలియుట జ్ఞానము. అట్టి జ్ఞానము కలిగి కర్మలను నిర్వర్తించుట శ్రేయస్కరము. నీ దుఃఖమునకు ఇతరులు కారణము కాదు. అట్లే నీ సుఖమునకు కూడ ఎవరునూ కారణము కాదు. నీవే కర్తవు, భర్తవు మరియు భోక్తవు.

## ఆరాధనములు - కర్తవ్యములు :

దేవతారాధనము నీలోని ప్రజ్ఞా కేంద్రముల ప్రచోదనము కొరకే. ప్రచోదనము చెందిన మనస్సుతో నీవు కర్తవ్యములను నిర్వర్తించుట జరుగవలెను. జీవనమున ఇది ఒక ఉపాయము. ప్రత్యేకించి దేవత లెవ్వరును విశేషముగ అనుగ్రహింపరు. నీ చేతల నుండి పుట్టు పుణ్య పాపములే నీకందింతురు. దేవతల రాజైన ఇంద్రుడు కూడ సత్కార్యములు నిర్వర్తించని వారికి సత్ఫలితము లీయలేదు. అటులనే యముడు కూడ యమము (క్రమశిక్షణ) కలిగిన

వారిని బాధించలేదు. దేవతలు కోపింతురని, అనుగ్రహింతురని భావించువారు మూర్ఖులు. వారి కోపమునకు గాని, అనుగ్రహమునకు గాని కారణము మానవుని ప్రవర్తనయే.

దేవతారాధనమున కలుగు స్ఫూర్తితో సత్కార్యములను త్రికరణ శుద్ధితో నిర్వర్తించుట జరుగవలెను. అట్లు కానిచో ఆరాధనలు భ్రాంతి కలిగించి మనసును తికమక పెట్టును.

గ్రహములు, దేవతలు కూడ నీ ప్రవర్తనమునకు సంబంధించిన ఫలితముల నిచ్చువారే గాని, వాటిని మార్పు చేయువా రెంతమాత్రము కాదు. నీ ప్రయత్న బలముననే సర్వమును కాలక్రమమున మార్పు చెందగలదు. అనుగ్రహము కొరకై వేచి యుండుట, కాలము కొరకై ఎదురు చూచుట మానవుని కర్తవ్య విముఖుని చేయును. ప్రస్తుతమున చేయవలసినవి చేయుట యొక్కటే సత్యము. ఇతరము లేవియును సత్యము కావు.

## ద్వంద్వములు :

సృష్టి యంతయు ద్వంద్వములతో కూడియున్నది. పగలు – రాత్రి, పౌర్ణమి – అమావాస్య, ఉత్తరాయణము – దక్షిణాయనము, జ్ఞానము – అజ్ఞానము, పుణ్యము – పాపము, సుఖము – దుఃఖము, వేడిమి – చలి. ఇట్లు ద్వంద్వము లనేకములు. సృష్టియందు జీవుడు ప్రవేశించినపుడు ద్వంద్వములలో ప్రవేశించినట్లే. అట్లు ప్రవేశించిన వాడు ద్వంద్వములలో ఒకదానిని కోరుట, మరొకదానిని నిరాకరించుట అను ప్రయత్నమున పడును. దీనివలన ప్రయోజనము లేదు. ఎంత

పోరాడినను ద్వంద్వములు కవలల వలె దరిచేరును కాని ఏ ఒక్కటి మాత్రము దక్కదు. అజ్ఞానమును దూషించు జ్ఞానము కూడ అజ్ఞానమే.

ద్వంద్వములు దాటుట కొక్కటియే పరిష్కార మార్గము. ఆ పరిష్కారమునకు మొదటి మెట్టు సృష్టియందు ద్వంద్వము లున్నవని తెలియుట. కాలానుగుణముగ అవి దరిచేరునని తెలియుట రెండవ మెట్టు. దరి చేరినపుడు అంగీకరించి అందు తన కర్తవ్యమును నిర్వర్తించుట మూడవ మెట్టు. అట్టి కర్తవ్య నిర్వహణమునకు దైవము నారాధించుట నాల్గవ మెట్టు. అట్టి ఆరాధనమున ద్వంద్వముల నుండి ఈవలకు వచ్చిన ప్రజ్ఞ కలవాడై యుండుట ఐదవ మెట్టు. అట్టి స్థితిలో సదా కర్తవ్య నిర్వహణమున నిమగ్నుడై వుండుట ఆరవ మెట్టు. ఎడతెరిపి లేకుండగ, స్థితప్రజ్ఞుడై పరహితము గావించుట ఏడవ మెట్టు.

ఏడు మెట్లెక్కి ఎనిమిదవ వానిగ స్థిరపడి ఏడు లోకముల కార్యములను నిర్వర్తించు వానిని 'గోపకు' డందురు. అనగా సృష్టి రహస్య మెరిగి, రహస్యముగ జీవించుచు, అనునిత్యము దివ్యానుభూతి పొందుచు, రసాస్వాదన చేయుచు జీవించువాడు. అట్టివారిని 'భాగవతు' లందురు. ఈ భాగవత మార్గమున భగవంతుని చేరి, భాగవత శరీరముతో శాశ్వతముగ చిరంజీవియై యుండుట చరమ స్థితి. అదియే పరమ స్థితి.

*అందరికిని హితమగు గాక !*

# 7

# ప్రస్థానము

ధనకామస్వామి బోధనలు అవంతీ నగరవాసులను ప్రచోదన మొనర్చుట ప్రారంభమయ్యెను. సంఘమందలి సమస్త వర్గములందు ధనకాముని ఉత్తమోత్తమ పరివర్తనకు ఆనందాశ్చర్యములను చెందిరి. అవంతి దేశమంతయూ అతనిని సేవించి, పూజించి, గౌరవించిరి. కొందరు అనుయాయులు గూడ నేర్పడిరి. ఆశ్రమ మేర్పడినది. నిత్యము ధ్యానము, పూజ, హోమము, అన్నదానము, విద్యా వైద్య దానములు ఆశ్రమమున జరుగుచుండెడివి. ఇట్లు పుష్కరకాలము సాగినది. 72 సంవత్సరములు స్వామివారి జీవితమున పరిపూర్తి అయినవి. ధనకాముడు మరల 'దివ్యకాము'డైనాడు. సంఘ క్షేమమునకై యజ్ఞయాగాది క్రతువులను నిర్వర్తింపచేసి 'శర్మ' అయినాడు. తండ్రి పెట్టిన 'దివ్య కామ శర్మ' నామమును సార్ధకము గావించినాడు. తపస్సునకై ఉజ్జయిని నగర ఆశ్రమము నుండి ఒక అర్ధరాత్రమున ఓంకారేశ్వరమునకు కాలినడకన బయలు దేరినాడు. అంతరంగ శిష్యునకు ఉపదేశ మొనర్చి, మహాకాలుని దర్శించి, ఓంకారమును చేరుటకు ఓంకారేశ్వర క్షేత్రమునకు పయన మయినాడు. అది మహాశివరాత్రి పర్వదినము.

ఓంకారేశ్వరమున, నర్మద పవిత్ర జల స్నానము గావించి, ఓంకారుని దర్శించి ఏకాంతమున తపస్సున కుపక్రమించినాడు.

## *ధనకాముని తపస్సు :*

నర్మద ఉత్తర తీరమున నొక ఏకాంత ప్రదేశమున, వింధ్యారణ్యములో తన తపోదీక్షను ప్రారంభించినాడు. భ్రూమధ్యమున చేతనను స్థిర మొనర్చి స్పందన మాధారముగ ఊర్ధ్వగమన మారంభించెను. దేహాత్మ భావము నశించగ, ప్రజ్ఞ బుద్ధియందు స్థిరపడినది. క్రమశః దేహము శుష్కించినది. ముఖము తేజోమయ మయినది. శ్వాస స్పందనమందు లీనమయి ఆగినది. మనసు బుద్ధియందు లయమందినది.

స్పందనము సూక్ష్మ స్పందనము చేరినది. తన స్వరూపము సూక్ష్మ స్వరూపము (అంగుష్ఠమాత్ర రూపము)గ ఫాలమున గోచరించినది. తానొక చతుర్భుజునిగ, శ్రీహరి ప్రతీకగ, తనకు గోచరించినాడు. అది తానే అని ఎరిగినాడు. ఆ రూపము తన దేహము నుండి యీవలకు వచ్చినది. తాను తన తనువును దర్శించినాడు. తానున్నది వెలుగు దేహము! తను చూచుచున్నది రక్తమాంసాదులతో కూడిన తన దేహమే! ఇపుడు తాను వెలుగు శరీరమున వున్నాడు. వెలుగుగా వున్నాడు. తన పూర్వ దేహమట్లే పద్మాసనమున నిలచియున్నది. తానందు మరల ప్రవేశించుట కిష్టపడలేదు. దానిని విసర్జించి హిరణ్మయ లోకమును చేరెను.

అమృతుడయ్యెను. ధనకాముడు భాగవతమూర్తియై, భాగవత శరీరమున శాశ్వతుడైనాడు.

అవంతీ నగర వాసులకు స్ఫూర్తిదాయకుడైనాడు. మంత్ర, యంత్ర, తంత్రీ సాధనలకు పుట్టినిల్లు అయిన అవంతీ నగరమున సాత్త్వికము, పామర జనామోదమగు భాగవత సంప్రదాయమునకు శ్రీకారము చుట్టినాడు. అందరి హృదయములందు స్థిరపడి స్ఫూర్తిదాయకుడై, సద్గురువై వెలసినాడు.

స్వస్తి !

